ప్రజావీక్షణం
విలేకర్లు కావలెను
అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ విలువలతో కూడిన జీవన శైలిలో
ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ
ప్రజల పక్షాన నిలబడాలని అనుకుంటున్నారా.?
బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా.?
అయితే రండి.. అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..
తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా
జిల్లాలు, మండలాల వారీగా నిబద్ధతతో
PJV ప్రజా వీక్షణం టీవి
పని చేసే విలేకరులు కావలెను
9866330400

ప్రజావీక్షణం
దినపత్రిక
ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

PJV ప్రజా వీక్షణం టీవి
Subscribe

www.prajaveekshanam.in సంపుటి:16 సంచిక :202 16 మంగళవారం, జూన్ 2026 పేజీలు : 12 వెల:రూ.2/-

Published from : Vijayawada, Krishna, Guntur, Kakinada, Vishakhapatnam, Vijayanagaram, Prakasham, Kadapa, Kurnool, Tirupathi, Anantapur, East Godavari, West Godavari

ధాన్యం సేకరణలో కేంద్రం ప్రేక్షకపాత్ర

- మద్దతు ధరలు ప్రకటించి మిన్నకుంటోంది
- కేంద్రం తీరుపై మండిపడ్డ మంత్రి తుమ్మల
- జొన్న,మొక్కజొన్నలను ఎంఎస్‌పి పరిధిలోకి తేవాలి

హైదరాబాద్,జూన్15 (ప్రజా వీక్షణం)

తెలంగాణ రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర వివక్ష చూపుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మండిపడ్డారు. మద్దతు ధర, ధాన్యం కొనుగోళ్ల విషయంలో కేంద్రం వ్యవహరిస్తున్న తీరును ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా.. కేంద్రం నుంచి ఆశించిన స్పందన లభించడం లేదని, ధాన్యం కొనుగోలు పక్రియలో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికతో ప్రజలకు చేరువయాం

- కొన్ని విభాగాలు ఇంకా ప్రజల్లోకి వెళ్లలేక పోయాయి
- అన్ని శాఖలు చేపట్టిన కార్యక్రమాలకు ప్రచారం కల్పించాలి
- గ్రామాల్లో వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలి
- మీడియా, డిజిటల్ మీడియా ద్వారా చేసిన పనులకు ప్రాచుర్యం
- క్షేత్రస్థాయిలో వెళ్లని అధికారులపై చర్యలు తప్పవు
- ప్రగతి ప్రణాళికపై సచివాలయంలో సిఎం రేవంత్ సమీక్ష

హైదరాబాద్,జూన్15 (ప్రజా వీక్షణం)

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో చేపట్టిన కార్యక్రమాలను కొన్ని విభాగాలు ఆశించినంతగా చెప్పుకోలేక పోయాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. వెంటనే అన్ని శాఖలు తాము చేపట్టిన కార్యక్రమాలకు తగినంత ప్రచారం కల్పించాలని సూచించారు.సంబంధిత ఉన్నతాధికారులు ఆ బాధ్యతలు తీసుకోవాలని ఆదేశించారు. మీడియా, డిజిటల్ మీడియా ద్వారా ఎప్పటికప్పుడు ప్రజలకు తాము చేసిన మంచి పనులు చెప్పుకోవాలని అధికారులకు సూచించారు.

వివరాలు 2లో

డిమాండ్ ఉన్న వరి వంగడాలకే ప్రోత్సాహం

- తెలంగాణ వరి ఉత్పత్తులకు విదేశాల్లో డిమాండ్
- రైతులు వాటినే పండించేలా దిశా నిర్దేశం
- మిల్లర్లు కొనుగోలు చేసే రకాలను పండిస్తే మేలు
- ఇందుకోసం రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు- కేబినేట్ సబ్‌కమిటీలో డిప్యూటి సిఎం భట్టి సూచనలు

2

తెలంగాణ వ్యాప్తంగా 'బ్రేక్‌ఫాస్ట్ విత్ మిల్క్' పథకం

- రాజ్‌భవన్ స్కూల్‌లో ప్రారంభించిన మంత్రి పొన్నం

హైదరాబాద్,జూన్15 (ప్రజా వీక్షణం)

తెలంగాణ వ్యాప్తంగా 'బ్రేక్‌ఫాస్ట్ విత్ మిల్క్' పథకం ప్రారంభమైంది. సోమవారం ఉదయం రాజ్‌భవన్ ప్రభుత్వ పాఠశాలలో అల్పాహారం పథకాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేసిన మంత్రి.. వారికి పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యత ప్రమాణాలతో బ్రేక్‌ఫాస్ట్ అందిస్తున్న ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు.

అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన శాంతి ఒప్పందం

- స్వాగతిస్తూ ఎక్స్ వేదికగా మోడీ ప్రకటన

న్యూఢిల్లీ,జూన్15 (ప్రజా వీక్షణం)

అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన శాంతి ఒప్పందంపై భారత ప్రధాని నరేంద్రమోదీ స్వాగతించారు. ఉద్రిక్తతలను ముగించేందుకు ఇరుదేశాలు ఓ అంగీకారానికి రావడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఎక్స్ ఖాతాలో మోదీ పోస్ట్ చేశారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వల్ల ప్రపంచవ్యాప్తంగా అనేక ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం పడింది. ఎన్నో దేశాల్లో ప్రాణనష్టం వాటిల్లింది. ఈ యుద్ధాన్ని ముగించేలా అమెరికా, ఇరాన్ అంగీకారం కుదుర్చుకోవడం స్వాగతించే విషయం. పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వాలను పునరుద్ధరించడం, స్వేచ్ఛా నౌకాయానం, వాణిజ్యానికి భరోసా కల్పించడంలో ఈ పరిణామం సాయపడుతుందని భారత్ విశ్వసిస్తోంది.సుస్థిరమైన తుది ఒప్పందానికి దారితీసేలా.. మిగిలిన అంశాల పైనా సానుకూల చర్చలు జరుగుతాయని విశ్వసిస్తున్నాం అని మోదీ రాసుకొచ్చారు.

మోడీ నేతృత్వంలో దూసుకుపోతున్న ఇండియా

- దేశాన్ని అద్భుతంగా అభివృద్ధి చేస్తున్న ప్రధాని- మెడికల్ టెక్నాలజీ సహా ఆధునిక - పరికరాల తయారీలో ముందంజకేపిటలిస్టుల రౌండ్ టేబుల్ -సమావేశంలో సిఎం చంద్రబాబు

2 లో

బాల్య వివాహాల నివారణకు చర్యలు

- తరుణి స్వచ్ఛంద సంస్థతో ప్రభుత్వం అవగాహన
- రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపడతామన్న సీతక్క

2

సింగరేణిని ప్రైవేట్ పరం చేసే కుట్రలు

- ఓపెన్ కాస్ట్‌లత విస్తరణతో సంస్థకు నష్టం- సింగరేణి బకాయిలు 50వేల కోట్లు చెల్లించాలి- కార్మికుల హక్కుల కోసం హెచ్ఎంఎస్‌తో కలసి పోరాటం
- బొగ్గుబాయిబాట కార్యక్రమంలో టిఆర్ఎస్ చీఫ్ కవిత

2 లో

తెలంగాణలో 19 నుంచి భారీ వర్షాలు

- అధికారులను అప్రమత్తం చేసిన మంత్రి

హైదరాబాద్,జూన్ 15 (ప్రజా వీక్షణం)

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జూన్ 19వ తేదీ నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో సోమవారం హైదరాబాద్‌లో అన్ని జిల్లాల ఉన్నతాధికారులతో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమీక్ష నిర్వహించారు.

ప్రజావీక్షణం దినపత్రిక
ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

సంపాదకీయం

నేలవిడిచి సాము చేస్తున్న ప్రాంతీయ పార్టీలు !

కాంగ్రెస్ నుంచి విడివడి ఏర్పడ్డ ప్రాంతీయ పార్టీలు అన్నీ మళ్లీ కాంగ్రెస్‌లో విలీనం కావాలని, అప్పుడే బిజెపి వ్యతిరేక పోరాటం బలోపేతం అవుతుందని శివసేన ఎంపి సంజయ్ రౌత్ ఈ మధ్య సంచలన వ్యాఖ్యలు చేశారు. తృణమూల్ కాంగ్రెస్, శరద్ పవార్ పార్టీలను ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆయన ఎందుకు అన్నారో కానీ, బిజెపిని దెబ్బతీయాలంటే కాంగ్రెస్ బలోపేతం కావాలన్న ఉద్దేశ్యంతో అలా అని వుంటారు. రెండు పార్టీల వ్యవస్థ ఉండివుంటే ఇలాంటిదే జరుగుతుంది. ఇష్టమున్న పార్టీలు ఆ రెండు పార్టీల్లో చేరుతాయి. అది బిజెపి లేదా కాంగ్రెస్ కావచ్చు. కానీ భారత ప్రజాస్వామ్యంలో ప్రాంతాయ పార్టీల పాత్రను తక్కువగా అంచనావేయలేం. ఒకప్పుడు కాంగ్రెస్ ఏకఛత్రాధిపత్యంగా, నిరంకుశంగా చేస్తున్న పాలనకు వ్యతిరేకంగా ప్రాంతీయ పార్టీలు పుట్టుకురావడం చూశాం. కమ్యూనిస్టులు పూర్తిగా బలహీనపడి, దేశంలో కమ్యూనిజం అంతం కావడంతో ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో బిజెపి, కాంగ్రెస్ పార్టీలతో పాటు కొన్ని ప్రాంతీయ పార్టలు తమ ప్రభావం చూపుతున్నాయి. ఉమ్మడి ఎపిలో కాంగ్రెస్ నిరంకుశ పాలనపై ఎన్టీఆర్ తిరుగుబాటు చేశారు. తెలుగుదేశం పార్టీ ఏర్పడి ఇప్పటికీ బలంగా నిలిచింది. ఇటీవల తమిళనాడులో ద్రవిడ పార్టీలపై యుద్ధం ప్రకటించిన టివికె పార్టీ ఏకంగా అధికారంలోకి వచ్చింది. ఇలా చెప్పుకుంటూ పోతే అనేక ప్రాంతీయ పార్టీలు ఇప్పుడు మనుగడ సాగిస్తున్నాయి. ఆయా పార్టీలు కాంగ్రెస్‌లో విలీనం అయితే జరిగేది కాంగ్రెస్ బలోపేతం మాత్రమే. కాంగ్రెస్ దేశంలో కుటుంబ పాలన సాగిస్తున్న పార్టీ. అక్కడ సోనియా, రాహుల్, ప్రియాంకల పెత్తనం తప్ప ఇతరులకు అఇకారం ఉండదు. పేరుకే ఖర్గే జాతీయ పార్టీ అధ్యక్షుడు. ఆయన మాట కూడా చెట్టుబాటు కాదు. అలాంటి పార్టీలో ప్రాంతీయ పార్టీల విలీనం కావాలన్న ఆలోచన సరికాదు. దీంతో ఎలాంటి రాజకీయ ప్రయోజనం ఉండదు. అందువల్ల సంజయ్ రౌత్ వ్యాఖ్యలకు ప్రాధాన్యం లేదు. ఇకపోతే కాంగ్రెస్ ముక్త భారత్ పిలుపునిచ్చిన మోడీ కూడా కాంగ్రెస్‌ను ఏమీ చేయలేక పోయారు. ఆయా రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలను కూడా బిజెపి ఏమీ చేయలేకపోతున్నది. దేశంలో ప్రజల ఆదరణ ఉన్నంత వరకు ఏ పార్టీ అయినా ఉంటుంది. బెంగాల్‌ను తీసుకుంటే ప్రాంతీయ పార్టీగా తృణమూల్ విఫలం అయ్యింది. ఒక ఆడబిడ్డ చేతిలో దేశ భద్రతకు భంగం ఏర్పడింది. తృణమూల్ కాంగ్రెస్ ఎన్నికల్లో ఓడిపోయిన కొద్దిరోజులకే చిన్నాభిన్నం అవుతోంది. ఇది స్వయంకృతంగా చూడాలి. అంతమాత్రాన కాంగ్రెస్‌లో విలీనం అయితే, భ్రష్టత్వం కాంగ్రెస్‌కు కూడా అంటుకుంటుంది. ఇకపోతే ఇండియా కూటమిలో ఉన్న పార్టీలు బలమైన వాణిని వినిపించడం లేదు. అందుకే ఎన్‌డిఎ వైఫల్యాలపై గట్టిగా పోరాడ లేకపోతున్నాయి. అధికారమే లక్ష్యంగా అన్ని పార్టీలు రాజకీయాలు నడుపుతున్నాయి తప్ప ప్రజల కోణంలో ఆలోచన చేయడం లేదు. దళితుల గురించి అన్ని పార్టీలు గొప్పలు చెబుతున్నా ఇప్పటివరకు ఏ రాష్ట్రంలోనూ పూర్తికాలం ముఖ్యమంత్రి అయిన దాఖలాలు లేవు. బెంగాల్లో గతంలో కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీ పరిపాలించినా అవకాశం దళితులకు దక్కలేదు. తమిళనాడులో డీఎంకే అధికారం కోల్పోయినప్పటికీ మరో ప్రాంతీయ పార్టీ అధికారం చేపట్టింది. కేరళలో అధికారం కోల్పోయాక ఇప్పుడు దేశంలో కమ్యూనిస్టు పార్టీలు క్రమంగా కనుమరుగయ్యే స్థితి కనబడు తున్నది. బిహార్‌లో ఆర్జేడీది అదే పరిస్థితి. ఒడిశాలో కూడా నవీన్ పట్నాయక్ బిజూ జనతాదళ్ అదే బాటలో ఉంది. ప్రాంతీయ పార్టీలు ప్రజల్లో బలంగా లేకపోవడం స్వార్థ చింతనతో పాలన చేయడం, ప్రజల ఆకాంక్షలను పట్టించుకోక పోవడం వంటి కారణాలతో కనుమరుగు అవుతున్నాయి. ఉమ్మడి ఎపిలో, ఇప్పుడు విభజిత ఎపిలోతెలుగుదేశం పార్టీ ఇంకా గట్టిగా నిలబడి ఉందంటే అందుకు ప్రజల మద్దతు కారణమని చెప్పాలి. వైఎస్ జగన్ ప్రాంతీయ పార్టీని ప్రజలు నమ్మి ఓటేస్తే ఆయన దానిని నిలబెట్టుకోలేక పోయారు. టిడిపి, ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ కూడా ఫక్తు కుటుంబ పార్టీలుగా మారాయి. అలాగే తెలంగాణలో బిఆర్ఎస్ కూడా కేవలం కుటుంబ పార్టీగా మారింది. ఇలాంటి పార్టీలను ప్రజలు దీర్ఘకాలం నమ్మరని గుర్తించాలి. ఈ స్థితిలో ప్రాంతీయపార్టీలు మారాలి. సమాజంలో అన్నివర్గాల ప్రజలను కలుపుకుని పోవాలి. ప్రజల ఎజెండాను తమ లక్ష్యంగా చేసుకుని ముందుకు సాగాలి. ప్రాంతీయ పార్టీలకు జాతీయ దృక్పథం ఉండాలి. ఆయా రాష్ట్రాల్లో పాలనలో భిన్నత్వం కనిపించాలి. అభివృద్ధిని ఆలంబనగా చేసుకుని ముందుకు సగాలి. లేకుంటే ఆయా పార్టీలను ప్రజలు విసిరి అవత పారేస్తారు. బెంగాల్లో అదే జరిగింది. దేశంలోని ప్రాంతీయ పార్టీలు కాంగ్రెస్, బిజెపిలకు భిన్నంగా పాలన సాగించాలి. ఆయా రాష్ట్రాలను అభివృద్ధిలో ముందు వరసలో నిలబెట్టాలి. జాతీయ పార్టీలకన్నా ప్రాంతీయ పార్టీలే నయమని నిరూపించాలి. ఈ ప్రయత్నంలో తెలుగుదేశం వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ పాలనలో తనదైన ముద్ర వేశారు. దళితులు,గిరిజనలు, బిసిలను రాజకీయంగా ఎంచుకుని వారిని ముందుకు నడిపించారు. ఓ రకంగా ఆయన విప్లవం సాధించారనే చెప్పాలి. అలాగే ఓటు బ్యాంక్ రాజకీయాలకు పోకుండా అభివృద్ధి రాజకీయాలను చేస్తే ప్రజలు తప్పకుండా ప్రాంతీచయ పార్టీలను ఆదరిస్తూనే ఉంటారు. ఎందుకంటే కాంగ్రెస్, బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఆయా ముఖ్యమంత్రులకు స్వేచ్ఛ ఉండదు. జాతీయ పార్టీ కనుక ఢిల్లీ ఆదేశాలను పాటించాల్సి ఉంటుంది. ఈ విషయంలో కాంగ్రెస్ ముందున్నది.

ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికతో ప్రజలకు చేరువయ్యాం

మొదటిపేజీ తరువాయి

వివిధ స్థాయిల్లో జరిగిన కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, ప్రజల నుంచి వచ్చిన ఫీడ్ బ్యాక్ను నమోదు చేయాలని, గ్రామాల్లో వచ్చిన సమస్యలను కూడా ఆయా శాఖలు పరిష్కరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ మూడు నెలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, చేసిన శంకుస్థాపనలు, ఆస్తుల వివరాలన్నీ నమోదు చేయాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మార్చి 16 నుంచి జూన్ 12 వరకు చేపట్టిన ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంతో ప్రజా ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువైందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. 9 రోజుల పాటు రాష్ట్రమంతటా జరిగిన కార్యక్రమాలపై సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. విభాగాల వారీగా చేపట్టిన కార్యక్రమాలు, వాటి ద్వారా వచ్చిన ఫలితాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. సందర్భంగా అన్ని విభాగాలు తాము జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు చేపట్టిన కార్యక్రమాల వివరాల నివేదికలను సమర్పించాయి. 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో చురుగ్గా పాల్గొన్న విభాగాలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందించారు. ప్రధాన కార్యదర్శుల నుంచి జిల్లా కలెక్టర్ వరకు అన్ని విభాగాల ఉన్నతాధికారులు ప్రతినెలా క్షేత్రస్థాయికి వెళ్లాలని గతంలోనే ఆదేశించిన విషయాన్ని గుర్తు చేశారు. క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లని అధికారులు, జిల్లా కలెక్టర్లపై తనకు నివేదిక ఇవ్వాలని చీఫ్ సెక్రటరీని సీఎం ఆదేశించారు. వారిపై క్రమశిక్షణా ఉల్లంఘన చర్యలు ఎందుకు తీసుకోకూడదో.. వెంటనే వివరణ కోరాలని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాలను పాటించని అధికారులను ఉపేక్షించవద్దని హెచ్చరించారు. ఇప్పటికీ రాష్ట్రంలో గ్రామ పంచాయతీ భవనాలు లేని గ్రామాలుంటే.. వెంటనే ఆ జాబితాను సిద్ధం చేయాలని పంచాయతీరాజ్ అధికారులను సీఎం ఆదేశించారు. అక్కడ కొత్తగా గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలను కూడా చేపట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకోవాలన్నారు. అన్ని పాఠశాలల భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. విద్యా, వైద్య విభాగాల్లో అన్ని స్థాయిల్లో ఫేషియల్ రికగ్నిషన్ విధానం అమలు చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పాఠశాలల నుంచి కాలేజీల వరకు, పీహెచ్ సీ నుంచి ఉస్మానియా, గాంధీ ఆసుపత్రి వరకు ఉద్యోగులందరికీ ఇదే అటెండన్స్ విధానం పాటించాలన్నారు. రాష్ట్రస్థాయిలో 99 రోజుల యాక్షన్ ప్లాన్‌పై సమీక్ష నిర్వహించినట్లే.. జిల్లాల వారీగా వెంటనే ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై వెంటనే సమీక్ష జరపాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సమీక్షలకు రాష్ట్ర స్థాయి నుంచి ప్రతి జిల్లాకో సీనియర్ ఐఏఎస్ అధికారిని స్పెషల్ ఆఫీసర్ గా నియమించి, ఆ జిల్లాకు పంపించాలని చెప్పారు. స్పెషలాఫీసర్ ఆ జిల్లా కలెక్టర్ కలిసి అన్ని విభాగాల్లో 99 రోజుల పాటు జరిగిన ప్రత్యేక కార్యక్రమాలు, ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, వివిధ పథకాలపై వచ్చిన స్పందనలన్నింటినీ సమీక్షించాలని ఆదేశించారు. జిల్లాల వారీగా ఈ ప్రగతి నివేదికలను విడుదల చేయాలని చెప్పారు. జిల్లాలతో పాటు నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాల వారీగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అందుకున్న లబ్దిదారులు, ప్రజా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. వీటిని డ్యాష్ బోర్డులో అందుబాటులో ఉంచాలని చెప్పారు. తాను ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తర్వాత జిల్లాల పర్యటనలు, ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై సీఎం అధికారులను ఆరా తీశారు. నియోజకవర్గాల వారీగా ముఖ్యమంత్రి హామీల పురోగతిపై నివేదిక ఇవ్వాలని ప్లానింగ్ విభాగాన్ని ఆదేశించారు. ÷రాజ్యసభ ఎంపీ వేంనరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రితో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

డిమాండ్ ఉన్న వరి వంగడాలకే ప్రోత్సాహం

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్,జూన్15 (ప్రజా వీక్షణం)

రాష్ట్రంలో 8 మేలురకం వరి వంగడాల సాగును పెద్దఎత్తున ప్రోత్సహించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. విదేశాల్లో తెలంగాణ బియ్యానికి బాగా డిమాండ్ ఉందని భట్టి విక్రమార్క ప్రస్తావించారు. మద్దతు ధర కంటే ఎక్కువ ధర పలికే అవకాశం ఉందని వెల్లడించారు. తెలంగాణ సోనామసూరి సహా ఎగుమతులకు అనుకూలమైన వరి రకాలపై రైతన్నలు దృష్టిపెట్టాలని సూచించారు. ఇందుకోసం రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సోమవారం ప్రజాభవన్‌లో భట్టి విక్రమార్క అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ సమావేశమైంది. ఈ సమావేశానికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. ఎగుమతి రకాల సాగుపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని అన్నారు. కేబినెట్ సబ్ కమిటీకి వ్యవసాయ నిపుణుల కీలక సూచనలు చేశారని తెలిపారు. ఆ 8 రకాల వంగడాలతోనే రైతులకు లాభాలు వస్తాయని వివరించారు. మార్కెట్ డిమాండ్ ఉన్న వరి రకాల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని అన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఆదరణ ఉన్న బియ్యం ఉత్పత్తిని పెంచాలని సూచించారు. రైతుల ఆదాయం పెంచే పంటల సాగును ప్రోత్సహించాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. గ్రామస్థాయిలో రైతులకు చైతన్య సదస్సులు నిర్వహించాలని సూచించారు. రైతులకు మార్కెట్ ఆధారిత పంటల సాగుపై మార్గనిర్దేశర చేయాలని నిర్ణయించామని అన్నారు. డిమాండ్ లేని వరి రకాల సాగును క్రమంగా తగ్గించాలని చెప్పారు. వినియోగదారులు, మిల్లర్లు కోరుకునే వరి రకాలకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఎగుమతులకు అనుకూలమైన నిర్దిష్ట వరి రకాల సాగు విస్తరణపై దృష్టి పెట్టాలని భట్టి విక్రమార్క మార్గనిర్దేశం చేశారు. వానాకాలం సాగుపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు పక్రియను కేంద్ర ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నామని అన్నారు. రైతులకు నష్టాలు రాకుండా మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటల ప్రణాళిక చేపట్టాలని సూచించారు. నాణ్యమైన బియ్యం ఉత్పత్తి, నిల్వ, మార్కెటింగ్ వ్యవస్థలను బలోపేతం చేయాలని నిర్ణయించామని చెప్పారు. రైతులకు లాభదాయకమైన, ఎగుమతి అవకాశాలు ఉన్న వంగడాలపై ప్రత్యేక ప్రోత్సాహకాలని పరిశీలించాలని సూచించారు. వ్యవసాయ ఉత్పత్తి, ధాన్యం కొనుగోలు, నిల్వ సదుపాయాలపై నిరంతర సమీక్షా సమావేశాలు కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నామని అన్నారు. తెలంగాణను అధిక విలువ కలిగిన వరి ఉత్పత్తి కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు చేపట్టాలని నిర్దేశిరచారు. రైతు ఆదాయం పెంపు, మార్కెట్ అనుసంధానానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించామని అన్నారు. రైతులకు మెరుగైన ధరలు వచ్చేలా మార్కెట్ డిమాండ్ ఆధారిత వ్యవసాయ విధానాన్ని అమలు చేయాలని భట్టి విక్రమార్క సూచించారు.

మోడీ నేతృత్వంలో దూసుకుపోతున్న ఇండియా

మొదటిపేజీ తరువాయి

అమరావతి,జూన్15 (ప్రజా వీక్షణం)

ప్రధాని మోదీ దేశాన్ని అద్భుతమైన వేగంతో అభివృద్ధి చేస్తున్నారని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొనియాడారు. మెడికల్ టెక్నాలజీ సహా ఆధునిక పరికరాల తయారీలో భారత్‌ది అగ్రస్థానమన్నారు. ఎలక్ట్రానిక్స్ పరికరాలు భారత్ నుంచి ఎగుమతి అవుతున్నాయని సీఎం వెల్లడించారు. సింగపూర్ పర్యటనలో చంద్రబాబు నాయుడు బిజీబిజీగా గడుపుతున్నారు. కాపిటలిస్టుల రౌండ్‌టేబుల్ సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. భారత్ సంస్కరణలతో దూసుకుపోతున్న అతిపెద్ద ఆర్థికశక్తి అని అన్నారు. చైనా లాంటి దేశాలు ఆర్థిక అభివృద్ధి సాధించటానికి దశాబ్దాల కాలం పట్టిందని.. కానీ భారత్‌కు అంత సమయం పట్టడం లేదని చెప్పుకొచ్చారు. 5వ జనరేషన్ యుద్ధ విమానాల తయారీ సహా ఇతర ఉత్పత్తులు వస్తున్నాయని అన్నారు. డెమోగ్రాఫిక్ డివిడెంట్‌తో అతిపెద్ద యువశక్తి కలిగిన మానవ వనరులను భారత్ కలిగి ఉందన్నారు. ఏపీలో తయారీ రంగాన్ని ప్రోత్సహించేలా వన్ ఫ్యామిలీ వన్ ఆంత్రప్రెన్యూర్ విధానాన్ని అనుసరిస్తున్నామన్నారు. భూ సమీకరణ అనే కొత్త విధానం ద్వారా ప్రాజెక్టులకు భూములు ఇస్తున్నామని.. అమరావతి రాజధాని ఈ ప్రాతిపదికనే నిర్మిస్తున్నామని చెప్పారు. ఆమ్మా, గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ పరిశ్రమలకు భూములను కేటాయించామని తెలిపారు. శ్రీసిటీ లాంటి ప్రత్యేక పారిశ్రామిక వాడలు పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయని సీఎం అన్నారు. పౌర సేవలతో పాటు అన్ని అంశాలకూ టెక్నాలజీని అనుసంధానించామన్నారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా పెట్టుబడులకు ఆస్కారం ఉందని తెలిపారు. వెంచర్ కాపిటలిస్టులు ఆ సంస్థ తయారు చేసిన స్టార్టప్‌లకు పెట్టుబడులు అందించే అవకాశం ఉందన్నారు. రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు.

బాల్య వివాహాల నివారణకు చర్యలు

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్,జూన్15 (ప్రజా వీక్షణం)

తెలంగాణలో బాల్య వివాహాల నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. మహిళా, శిశు సంక్షేమ శాఖ – తరుణి స్వచ్ఛంద సంస్థ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ కార్యక్రమం మంత్రి సీతక్క సమక్షంలో జరిగింది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడారు. 'బాల్య వివాహం– బతుకు ఆగం' అనే నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించామని మంత్రి సీతక్క తెలిపారు. బాల్య వివాహాలు, మైనర్ బాలికల గర్భధారణలను నివారించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ ఒప్పందం ద్వారా గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రజల్లో చైతన్యం కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా బాల్య వివాహాల వల్ల బాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై కలిగే ప్రతికూల ప్రభావాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. అంగన్‌వాడీ సిబ్బంది, మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. బాల్య వివాహాల గుర్తింపు, నివారణ, చట్టపరమైన చర్యలపై వారికి అవసరమైన మార్గదర్శకాలు అందిస్తామని తెలిపారు. అదే విధంగా సోషల్ మీడియా, డిజిటల్ వేదికలు, ప్రచార సామగ్రి ద్వారా రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచారం చేపడతామని చెప్పారు. బాలికల విద్య కొనసాగింపు, ఆరోగ్య సంరక్షణ, భద్రత, స్వయం సాధికారత అంశాలకు ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. బాల్య వివాహాల నిర్మూలన కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, సమాజం మొత్తం కలిసి ముందుకు రావాల్సిన అవసరం ఉందని మంత్రి సీతక్క సూచించారు.

సింగరేణిని ప్రైవేట్ పరం చేసే కుట్రలు

మొదటిపేజీ తరువాయి

కొత్త బొగ్గు బావులు తెచ్చుకుంటే లక్షలాది మందికి ఉద్యోగాలు వస్తాయని, మన హక్కైన డిపెండెంట్ ఉద్యోగాల కోసం రాజీలేని పోరాటం చేయాల్సి ఉందన్నారు. సింగరేణిని కాపాడాలనే చిత్తశుద్ధి ప్రభుత్వానికి ఉంటే.. వెంటనే సింగరేణికి బకాయి ఉన్న 50 వేల కోట్ల రూపాయలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అండర్ గ్రౌండ్ మైనింగ్‌ను రద్దు చేసి, ఓపెన్ కాస్ట్ మైనింగ్‌ను పెంచుతూ సింగరేణి ఉనికిని దెబ్బతీసే కుట్రలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. మంచిర్యాల జిల్లాలో చేపట్టిన బొగ్గుబాయి కార్యక్రమంలో భాగంగా.. కాసిపేట మైన్–1ను ఆమె సందర్శించారు. నేరుగా గనిలోకి వెళ్లి కార్మికులతో మాట్లాడి, క్షేత్రస్థాయిలో వారు ఎదుర్కొంటున్న కష్టాలను, సమస్యలను అడిగి తెలుసు కున్నారు. కాసిపేట నుంచే వారం రోజుల పాటు సాగనున్న ఈ 'బాయి బాట' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కవిత కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణలో కొత్త రాజకీయ శక్తిగా అవతరించిన టిఆర్ఎస్ కు సింగరేణి బిడ్డల ఆశీర్వాదం కావాలని ఆమె కోరారు. వారసత్వ ఉద్యోగాల్లో సింగరేణి కార్మికులకు ప్రభుత్వం అన్యాయం చేస్తోందని తెలంగాణ రక్షణసేన అధ్యక్షురాలు కవిత మండిపడ్డారు. సింగరేణి సంస్థ పరిరక్షణ కోసమే.. టీఆర్ఎస్, హింద్ మజ్దూర్ సభ (హెచ్ఎంఎస్) కలిసి పని చేస్తున్నాయని చెప్పారు. పాలసీలు రూపొందించాల్సిన సీఎం, డిప్యూటీ సీఎంలే అధికారులకు వినతిపత్రాలు ఇస్తూ.. కార్మిక రంగాన్ని మభ్యపెడుతున్నారని విమర్శించారు. సింగరేణి సంస్థను ప్రైవేటీకరించడానికి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. అండర్ గ్రౌండ్ మైన్లను కాపాడుకోవడానికి హెచ్ఎంఎస్‌తో కలిసి పోరాటం చేస్తామని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో, ఆ తర్వాత బిఆర్ఎస్ ప్రభుత్వంలోనూ మనం కలిసి పనిచేశాం. నేను ఎక్కడున్నా అనునిత్యం మీ పక్కనే ఉండి పోరాడాను. గతంలో మెడికల్ బోర్డు కోసం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌ను ముట్టడించిన చరిత్ర మనది. కానీ ఈ ప్రభుత్వంలో.. సర్వసాధారణంగా జరగాల్సిన పనుల కోసం కూడా కార్మికులు రో÷–డడెక్కి పోరాడాల్సి వస్తోంది అంటూ కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీ, హైదరాబాద్‌లలో ఉండి సింగరేణికి కొత్త బొగ్గు బావులు తేవాల్సిన సీఎం, డిప్యూటీ సీఎంలు.. ఇక్కడికి వచ్చి కార్మికులకే వినతిపత్రాలు ఇస్తూ మభ్యపెడుతున్నారని కవిత మండిపడ్డారు. ఐటీ సమస్యలను తీర్చడంలో, నెలకు రెండుసార్లు మెడికల్ బోర్డు పెట్టడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.

ఆసిఫాబాద్ లోని ప్రైవేట్ ఆస్పత్రులలో హెల్త్ కార్డు లు ఆమోదించాలి

- కవితమ్మ కు వినతిపత్రం అందజేసిన సామాజిక కార్యకర్త దాసరి శ్రీనివాస్..

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జూన్ 15

(ప్రజా వీక్షణం న్యూస్)

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రులలో ఆరోగ్యశ్రీ మరియు ప్రైవేట్ కంపెనీలకు చెందిన హెల్త్ కార్డులకు వైద్యం అందించాలని తెలంగాణ రాష్ట్ర సోషల్ వర్కర్ దాసరి శ్రీనివాస్ తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవితమ్మకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ నేడు కొమరం భీమ్ జిల్లాలోని ఆసిఫాబాద్ పట్టణంలో టిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయం ప్రారంభోత్సవానికి విచ్చేసిన కవిత కు శుభాకాంక్షలు తెలియజేస్తున్నామన్నారు. జిల్లా కేంద్రంలో ఉన్న ప్రయివేట్ ఆస్పత్రులలో ఆరోగ్యశ్రీ సేవలు లేకపోవడం దారుణం అన్నారు. అలాగే బడుగు బలహీన వర్గాలు మధ్యతరగతి ప్రజలు తమ కుటుంబ సభ్యుల యొక్క ఆరోగ్యం కొరకై ప్రైవేట్ కంపెనీలలో ఉండే స్టార్ హెల్త్,కేర్ హెల్త్ తదితర కంపెనీల హెల్త్ కార్డులు తీసుకొని ఉన్నారు. జ్వరం వచ్చిన,రోడ్డు ప్రమాదాలు జరిగిన ఆసిఫాబాద్ లో వైద్యం చేసుకోలేని పరిస్థితి నెలకొంది.ఈ ప్రైవేట్ ఆస్పత్రుల వారు మెరుగైన వైద్య సేవల పరికరాలు లేకుండా ప్రతి చిన్న చిన్న చికిత్సల నిమిత్తం కూడా మంచిర్యాలకు రిఫర్ చేస్తున్నారు.ఇటు మంచిర్యాలకు అటు చంద్రపూర్ వెళ్లాలంటే సుమారు 65 కిలోమీటర్ల దూరం ఉంది.మధ్యతరగతి వారు అంబులెన్స్ చార్జీలు చెల్లించాలంటే జేబులకు చిల్లులు పడుతున్నాయి. ప్రైవేట్ ఆస్పత్రి వారు ఆయా హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలకు దరఖాస్తు చేసుకునే విధంగా జిల్లా కలెక్టర్ కు తమ ద్వారా తెలపాలని ఆస్పత్రుల వారు హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్లై చేసుకోని ఎడల వారి యొక్క లైసెన్సును రద్దు చేయాలని కోరుతున్నామన్నారు. అలాగే తమ పార్టీ

కార్యాలయం పక్కనున్న గుండి గ్రామం కు బైపాస్ రోడ్డుకు గల అప్రోచ్ రోడ్డు అధ్వానంగా ఉందని ఆర్టీసీ బస్సులు సుమారు రెండు కిలోమీటర్ల మేర దూరం వేళ్ళి తిరిగి రావడం వల్ల కొన్ని లక్షల రూపాయల డీజిల్ వృధా అవుతుందని ప్రజా దనం ఓక కిలో మీటర్ రోడ్డు మూలంగా వృధా కాకుండా ఉండాలంటే గుండి గ్రామం వేళ్ళు రోడ్డు బాగు చేయాలని కోన్ని సంవత్సరాల కళ గుండి గ్రామ బ్రిడ్జి పనులు ప్రారంభించాలని తమ ద్వారా ప్రభుత్వానికి తెలపాలని విజ్ఞప్తి చేస్తున్నామని దాసరి శ్రీనివాస్ తెలిపారు.

పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ నితికా పంత్ ఐపీఎస్

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జూన్ 15 (ప్రజా వీక్షణం న్యూస్)

- శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి
- పోలీస్ అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచన కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికా పంత్ ఐపీఎస్ కాగజ్ నగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలు, లాకప్ రూమ్, రిసెప్షన్, బెల్ ఆఫ్ ఆర్మ్స్ రూమ్, స్టోర్ రూమ్, నమోదు చేసిన రికార్డులు, పెండింగ్ కేసుల పురోగతి, స్టేషన్ హాజరు రిజిస్టర్, స్టేషన్ శుభ్రత తదితర విభాగాలను పరిశీలించారు.ఎస్పీ ఎస్‌హెచ్‌ఓ సందీప్ కుమార్ తో , స్టేషన్ సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి పోలీసు సిబ్బందీ ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో చట్టవ్యతిరేకచర్యలు, అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ రవాణా, మాదక ద్రవ్యాలపై దృష్టి సారించాలని ఆదేశించారు.స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదిదారుడితో, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని అన్నారు.మహిళలు, బాలికల భద్రతకు సంబంధించిన కేసుల్లో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, లా అండ్ ఆర్డర్ విషయంలో రాత్రిపూట పర్యవేక్షణ, పికెటింగ్, ప్యాట్రోలింగ్‌ను కచ్చితంగా కొనసాగించాలని సూచించారు. ప్రజాభద్రతకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎస్పీ వెంట కాగజ్ నగర్ డిఎస్పీ వాహిదుద్దీన్ పాల్గొన్నారు.

అర్ధరాత్రి బాపట్ల దగ్గర సర్కార్ ఎక్స్‌ప్రెస్ లో దొంగల భీభత్సం

- మహిళా ప్రయాణికుల మెడల్లోంచి 7 సవర్ల బంగారు గొలుసులు తెంచుకున్న దొంగలు
- 9 రౌండ్లు కాల్పులు జరిపిన పోలీసులు
- దొంగతనానికి పాల్పడిన నిందితులలో ఒకరిని అదుపులోకి తీసుకున్న రైల్వే పోలీసులు

బాపట్ల : జూన్ 15 (ప్రజా వీక్షణం)

బాపట్ల సమీపంలో నల్లమడవాగు వంతెన సమీపంలో ఆదివారం అర్ధరాత్రి వేళ సర్కార్ ఎక్స్‌ప్రెస్ రైలు లక్ష్యంగా దొంగల ముఠా ఘోర దోపిడీకి ఒడిగట్టింది.ఆదివారం అర్ధ రాత్రి దాటాక 1:15 గంటల సమయంలో నల్లమడవాగు వంతెన సమీపంలో దుండగులు సిగ్నల్ వ్యవస్థను టాంపరింగ్ చేసి రైలును నిలిపివేశారు.వెంటనే ఆరుగురు దొంగలు రైళ్లోని ఎస్ 3,ఎస్ 6 బోగిల్లోకి చొరబడి,నిద్రిస్తున్న ఇద్దరు మహిళా ప్రయాణికుల మెడల్లోంచి 7 సవర్ల (56 గ్రాములు) బంగారు గొలుసులను బలవంతంగా తెంచుకున్నారు.ప్రయాణికులు ఎదురుతిరిగి కేకలు వేయడంతో,దొంగలు రైలు చైన్ లాగి కిందకు దూకారు.రైల్లోనే విధుల్లో ఉన్న రైల్వే పోలీసులు (జీఆర్పీ) తక్షణమే స్పందించి పారిపోతున్న దొంగలపై 9 రౌండ్లు ఎదురుకాల్పులు జరిపారు.అయితే చీకటిని ఆసరాగా చేసుకుని దుండగులు సమీపంలోని పొలాల్లోకి పారిపోయారు.బాపట్ల జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు బాపట్ల మండలం అప్పికట్ల ప్రాంతాల్లో గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి.రైల్లో దొంగతనానికి పాల్పడిన నిందితులలో ఒక వ్యక్తిని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.గత రెండు నెలల్లో ఇలాంటి రైలు దోపిడీ జరగడం ఇది మూడోసారి కావడంతో ప్రయాణికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

ఢిల్లీలో 'సేన ప్రస్థానం ': పాల్గొన్న పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

న్యూఢిల్లీ, జూన్ 15:(ప్రజా వీక్షణం)

దేశ రాజధాని ఢిల్లీ వేదికగా జనసేన పార్టీ ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "జాతీయ సమైక్యత కోసం సేన ప్రస్థానం" కార్యక్రమంలో ఏలూరు జిల్లా పోలవరం నియోజకవర్గ శాసనసభ్యులు చిర్రి బాలరాజు పాల్గొన్నారు. జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు చేపట్టిన ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చారు.దేశ ఐక్యత, సమగ్రత, జాతీయ భావజాల పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా ఈ మహత్తర కార్యక్రమాన్ని రూపకల్పన చేశారు.ఈ సందర్భంగా పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ.. దేశ సమైక్యతను, జాతీయతా భావాన్ని మరింత బలోపేతం చేయాలనే సంకల్పంతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని కొనియాడారు. ఈ ప్రస్థానం నేటి యువతలో జాతీయ భావాలను పెంపొందించడానికి ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.దేశ శ్రేయస్సు, శరవేగంగా అభివృద్ధి చెందడం, సామాజిక సామరస్యం మరియు జాతీయ ఏకత్వం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని పోలవరం నియోజకవర్గం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తెలిపారు.అలాగే ఈ జాతీయ సమైక్యత సదస్సుకు జనసేన పార్టీకి చెందిన రాష్ట్ర, జాతీయ స్థాయి అగ్ర నాయకులతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులు, మేధావులు, వేలాది మంది పార్టీ కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

షిఫ్ట్ ఆపరేటర్ల సమస్యల పరిష్కారానికి ఏఈ శ్రావణ్ కుమార్ హామీ

(బొర్రంపాలెం):జూన్ 15(ప్రజా వీక్షణం)

విద్యుత్ శాఖలో షిఫ్ట్ ఆపరేటర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బొర్రంపాలెం సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) శ్రావణ్ కుమార్‌కు సోమవారం సబ్‌స్టేషన్ సిబ్బంది వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా జంగారెడ్డిగూడెం డివిజన్ సెక్రటరీ బారిన సత్యనారాయణ మాట్లాడుతూ.. విద్యుత్ సబ్‌స్టేషన్లలో రాత్రి పగలు తేడా లేకుండా విధులు నిర్వహిస్తున్న షిఫ్ట్ ఆపరేటర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఈని కోరారు. ఆపరేటర్ల పనివేళలు, రక్షణ పరికరాలు, తదితర విధులకు సంబంధించిన పలు కీలక అంశాలపై ఈ సందర్భంగా అధికారులతో కూలంకషంగా చర్చించారు. అలాగే సిబ్బంది అందించిన రిప్రజెంటేషన్‌పై అసిస్టెంట్ ఇంజనీర్ శ్రావణ్ కుమార్ సానుకూలంగా స్పందించారు. షిఫ్ట్ ఆపరేటర్లు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యపై ఆయన క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏఈ మాట్లాడుతూ.. సిబ్బంది సమస్యలన్నింటినీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, వీలైనంత త్వరలోనే పరిష్కరించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ప్రతినిధులు పవన్ కుమార్, సాయినాథ్, రాజేష్, శివకుమార్, మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే తంగిరాల ప్రభాకర్ రావు వర్ధంతి

- జుజ్జూరులో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన
- డీసీ చైర్మన్ కాపా రాంబాబు

జుజ్జూరు, జూన్ 15 (ప్రజావీక్షణం):

నందిగామ నియోజకవర్గం, వీర్లపాడు మండలం జుజ్జూరు గ్రామంలో మాజీ శాసనసభ్యులు, దివంగత నేత తంగిరాల ప్రభాకర్ రావు వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. డీసీ చైర్మన్ కాపా రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని తంగిరాల ప్రభాకర్ రావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి తంగిరాల ప్రభాకర్ రావు చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వీర్లపాడు మండల పార్టీ అధ్యక్షులు కొండ్రగుంట శ్రీనివాసరావు, జిల్లేపల్లి సుధాకర్, నందిగామ నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు కొమ్మూరి శేషు, మాదల కోటయ్య, జానీ తదితర ముఖ్య నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలి

దేవరకద్ర జూన్ 15 ప్రజా వి క్షణం

తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ కార్మిక సంఘం టి యు సి ఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి జరిగింది. ఈ ధర్నాకు అధ్యక్షుడిగా వెంకట రాములు వహించగా ముఖ్యఅతిథిగా టియుసిఏ జిల్లా కార్యదర్శి సాంబశివుడు మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కనీస వేతనాలు పెంచాలని జీవో 60 ప్రకారము వేతనాలు ఇవ్వాలని ఈఎస్ఐపిఎఫ్ ఇన్సూరెన్స్ అమలు చేయాలని పెరుగుతున్న జనాభా అనుగుణంగా సిబ్బందిని పెంచాలని రేవంత్ రెడ్డి, ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం ఇందులో పాల్గొన్నవారు టి యు సి ఐ జిల్లా నాయకులు బాలు. గ్రామపంచాయతీ కార్మిక సంఘం నాయకులు ఆశన్న కిష్టన్న బాలనాగన్న పోచమ్మ అంజి తదితరులు పాల్గొని ఇంచార్జి ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు.

ప్రజావీక్షణం
దినపత్రిక

పారిశుద్ధ్యం,సుందరీకరణ పనులను పరిశీలించిన మునిసిపల్ కమీషనర్ ఎం.హాసిని

బాపట్ల : జూన్ 15 (ప్రజా వీక్షణం)

బాపట్ల పురపాలక సంఘ పరిధిలో మునిసిపల్ కమీషనర్ మామిళ్లపల్లి హాసిని సోమవారం ఉదయం పలు వార్డుల్లో పర్యటించి పారిశుద్ధ్య మరియు సుందరీకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జీబీసీ రోడ్డు ప్రధాన రహదారి డివైడర్లను తనిఖీ చేసిన కమీషనర్ మొక్కల మధ్య పెరిగిన కలుపు మొక్కల తొలగింపును పరిశీలించారు. రహదారి డివైడర్ల సుందరీకరణను మరింత మెరుగుపరుస్తూ మొక్కలను క్రమం తప్పకుండా సంరక్షించాలని డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ ఎస్.ఎస్.ఆర్.కృష్ణా రెడ్డి కి సూచించారు. అనంతరం వివేకానంద కాలనీలోని మునిసిపల్ పార్కును సందర్శించి పార్కు నిర్వహణ,పరిశుభ్రత మరియు పార్కు పరిరక్షణ చర్యలను సమీక్షించారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించే విధంగా పార్కును ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. తదుపరి భీమావారిపాలెం ప్రాంతంలో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించిన కమీషనర్ చెత్త సేకరణ,వీధుల పరిశుభ్రత తదితర పనులను ప్రతిరోజూ సమర్ధవంతంగా నిర్వహించాలని సూచించారు. పట్టణంలో పరిశుభ్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని,ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించేందుకు కృషి చేయాలని శానిటరీ ఇన్స్పెక్టర్ చేవూరి కరుణను ఆదేశించారు.

సర్ ప్రక్రియలో ఆంధ్రప్రదేశ్ లో ఉన్న అన్ని రాజకీయ పార్టీలకు భాగస్వామ్యం కల్పించాలి

- నవతరం పార్టీ జాతీయ అధ్యక్షులు రావు సుబ్రహ్మణ్యం

బాపట్ల : జూన్ 15 (ప్రజా వీక్షణం)

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియలో ఆంధ్రప్రదేశ్ లో ఉన్న అన్ని రాజకీయ పార్టీలకు భాగస్వామ్యం కల్పించాలని కోరుతూ నవతరం పార్టీ జాతీయ అధ్యక్షులు రావు సుబ్రహ్మణ్యం రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమీషనర్ కు లేఖ రాశారు. ఏపీలోని అన్ని జిల్లాల్లో జరిగే అన్ని సమావేశాలకు ఆహ్వానం అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాన ఎన్నికల కమీషన్ ఆధ్వర్యంలో ఆర్ యు పీ పీ ఎస్ తో సమావేశం ఏర్పాటు చేసి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ గురించి చర్చించాలని కోరారు. గుర్తింపు పొందిన జాతీయ,రాష్ట్ర స్థాయి రాజకీయ పార్టీల మాదిరిగానే అన్ని సమావేశాలకు ఆర్ యు పీ పీ ఎస్ ఆహ్వానించేలా జిల్లా కలెక్టర్ లకు ఆదేశాలు ఇవ్వాలని నవతరం పార్టీ నుండి కోరుతున్నామన్నారు.



Shri.RAVU SUBRAHMANYAM
FOUNDER & NATIONAL PRESIDENT
Mobile : 9059514700
9948419357
E-mail : navataramparty@gmail.com
ravusubrahmanyam@gmail.com

NAVATARAM PARTY
D.No.9-442,CR COLONY,CHIRALA(URB)PET,GUNTUR DISTRICT - 523616, ANDHRA PRADESH, INDIA.

ప్రియుత సీతక్క గారికి,

రూమ్ నంబర్ 192,గ్రౌండ్ ఫ్లోర్ ,బ్లాక్ నంబర్ -5,

ఏపీ సెక్రటేరియట్ ,వెలగపూడి ,అమరావతి ,

ఆంధ్రప్రదేశ్-522238.

సార్,

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పరిధిలో గల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ లో RUPP's ను భాగస్వామ్యం చేసేందుకు కృతజ్ఞతలు.175 నియోజకవర్గాల పూర్తి సమాచారం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ వివరాలు RUPP's అందించాలని కోరుతున్నాము.సీతక్క అధ్వర్యంలో RUPP'sతో సమావేశం నిర్వహించాలని కోరుతున్నాము.గుర్తింపు పొందిన జాతీయ,రాష్ట్ర స్థాయి రాజకీయ పార్టీల మాదిరిగానే అన్ని సమావేశాలకు RUPP's ఆహ్వానించేలా జిల్లా కలెక్టర్ లకు ఆదేశాలు ఇవ్వాలని నవతరంపార్టీ నుండి కోరుతున్నాము.

For NAVATARAM PARTY
President
రావుసుబ్రహ్మణ్యం

నవతరం పార్టీ అధ్యక్షులు.

కరెంటు సమస్యను పరిష్కారం చేయని నాయకులు రాజీనామా చేయండి

దేవరకద్ర జూన్ 15 ప్రజా విక్షణం

దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలో కరెంటు సమస్యలను పరిష్కారం నాయకులు వెంటనే వారి పదవులకు రాజీనామా చేయాలని ప్రజలు కోరుతున్నారు. కరెంటు అధికారులు వారి ఇష్టం వచ్చినట్లు ఆడుతున్నారని వర్షం లేకున్నా కూడా గాలి దుమ్ము లేకున్నా కూడా కరెంటు సప్లై బంద్ చేసి ఫోన్ చేసిన కూడా స్పందించడం లేదని ప్రజలు అంటున్నారు. నాయకులు కరెంటు సమస్యలు పరిష్కారం చేయమని కోరినగూడ ఎటువంటి స్పందన లేదు. అందుకు నాయకులు వారి పదవులకు వెంటనే రాజీనామా చేయాలని ప్రజలు ముక్త కంఠంతో కోరుతున్నారు. చుట్టుపక్కల కరెంటు ఉన్నా కూడా దేవరకద్రలోమాత్రం కరెంటు ఉండదు. అంగట్లోఅన్ని ఉన్న అల్లుడి నోట్లో శని అన్నట్లు మన దేవరకద్రలో మున్సిపాలిటీ కేంద్రంలో మాత్రం కరెంటు తక్కువ కోతలు ఎక్కువ అని ప్రజలు అరొ పిస్తున్నారు. ఇప్పటికైనా నాయకులు స్పందించి దేవరకద్రలోకరెంటు సమస్య లేకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గిరిజన విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దు!

- ఇటికలకోట ఆశ్రమ ఉన్నత పాఠశాల స్థాయి తగ్గింపు నిర్ణయాన్ని వెంటనే రద్దు చేయాలి

- గ్రామస్తులు, తల్లిదండ్రుల ఆధ్వర్యంలో పాఠశాల వద్ద పెద్దఎత్తున ఆందోళన

పోలవరం, జూన్ 15 (ప్రజా వీక్షణం):

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలతో గిరిజన విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దని గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని ఇటికలకోట ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాల స్థాయిని తగ్గిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలలో అన్ని తరగతులను యథా తథంగా కొనసాగించాలని, గిరిజనులకు విద్యను దూరం చేయొద్దంటూ సోమవారం పాఠశాల ఎదుట పెద్దఎత్తున నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. ఇటికలకోట గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత బాలుర పాఠశాలలో 8, 9, 10 తరగతులను తొలగించడం ప్రభుత్వ దుర్మార్గపు చర్య అని ఆదివాసీ గిరిజన సంఘం ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి కారం భాస్కర్ విమర్శించారు. ఆందోళన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ... పాఠశాలలో కేవలం 3వ తరగతి నుండి 7వ తరగతి వరకే పరిమితం చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారని స్పష్టం చేశారు. గిరిజన ప్రాంతాల్లో విద్యా అవకాశాలను విస్తరించాల్సిన ప్రభుత్వం, ఉన్న ఉన్నత పాఠశాలలను కుదించడం అత్యంత దురదృష్టకరం. ఈ నిర్ణయం వల్ల ఇటికలకోటతో పాటు చుట్టుపక్కల గ్రామాల గిరిజన విద్యార్థులు చదువుకు దూరమయ్యే ప్రమాదం ఉందని కారం భాస్కర్, ఆదివాసీ గిరిజన సంఘం నేత తెలిపారు. ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఇటికలకోట పాఠశాల 100 శాతం (వంద శాతం) ఉత్తీర్ణత సాధించిందని వారు గుర్తు చేశారు. గతంలో జిల్లా కలెక్టర్, ఐటీడీఏ ఉన్నతాధికారులు పలుసార్లు ఈ పాఠశాలను సందర్శించి విద్యార్థులను, ఉపాధ్యాయులను, సిబ్బందిని అభినందించారని పేర్కొన్నారు. నాడు ఉత్తీర్ణతను చూసి మెచ్చుకున్న అధికారులే, నేడు అదే పాఠశాలలో తరగతులను తగ్గించాలని చూడటం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. 2015లో గిరిజన ప్రాంతాల్లోని వసతి గృహాలను ఆశ్రమ పాఠశాలలుగా మార్చారని, ఏలూరు జిల్లాలో మొత్తం 54 హాస్టల్స్ ఉండగా అందులో 25 పాఠశాలలను ఆశ్రమ విద్యాసంస్థలుగా ప్రభుత్వం ఎంపిక చేసిందని వివరించారు. అయితే, ప్రస్తుతం



ప్రభుత్వం తీసుకొచ్చిన రేషనలైజేషన్ విధానం వల్ల:
3, 4 తరగతులు చదివే విద్యార్థులు విద్యా హక్కును కోల్పోతున్నారు. 8, 9, 10 తరగతులు చదివే అవకాశం లేకుండా పోతోంది. విద్యార్థులు లేరనే సాకు చూపడం సరికాదని, జిల్లాలోని కోర్సవారిగూడెం, కోయ నాగంపాలెం గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు ఉన్నప్పటికీ వాటిని తెరవడం లేదని మండిపడ్డారు. గిరిజన విద్యార్థుల చదువులకు ఆశ్రమ పాఠశాలలే కీలకమని, వాటిని బలోపేతం చేయాల్సింది పోయి బలహీనపరచడం తగదన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు, ప్రభుత్వం జోక్యం చేసుకుని 3 నుండి 10వ తరగతి వరకు యథా తథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం గ్రామ ప్రజలు, తల్లిదండ్రులతో కలిసి పాఠశాల అధికారులకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు సున్నం గంగాజలం, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్‌పర్సన్ ఎం. ప్రియాంక, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మడివి చలపతిరావు, గ్రామ పెద్దలు జె. కృష్ణ, కొమరం పోసే రత్నం, మరియు పెద్ద సంఖ్యలో గిరిజన మహిళలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జాతీయ పారా స్విమ్మింగ్‌లో ఏపీ క్రీడాకారుల ఘనత శాప్ చైర్మన్ రవి నాయుడు అభినందనలు

అమరావతి, జూన్ 15:(ప్రజా వీక్షణం)

బెంగళూరు వేదికగా జరిగిన 26వ జూనియర్, సబ్ జూనియర్ నేషనల్ పారా స్విమ్మింగ్ ఛాంపియన్షిప్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పారా స్విమ్మర్లు అద్భుత ప్రతిభ కనబరిచి పతకాల పంట పండించారు. ఈ నెల 8వ తేదీ నుండి 10వ తేదీ వరకు జరిగిన ఈ జాతీయ స్థాయి పోటీల్లో ఏపీ క్రీడాకారులు అసాధారణ నైపుణ్యాన్ని ప్రదర్శించి రికార్డు స్థాయిలో పతకాలను కైవసం చేసుకున్నారు. ఈ ఛాంపియన్షిప్‌లో రాష్ట్ర జట్టు మొత్తం 29 పతకాలను సాధించి సరికొత్త రికార్డు సృష్టించింది. ఇందులో:
స్వర్ణ పతకాలు: 15
రజత పతకాలు: 8
కాంస్య పతకాలు: 6
"రాష్ట్ర క్రీడాకారులు జాతీయ స్థాయిలో ఇంతటి ఘన విజయాన్ని సాధించి, ఆంధ్రప్రదేశ్ కీర్తి పతాకాన్ని ఎగురవేయడం గర్వకారణం." అని రవి నాయుడు శాప్ చైర్మన్ తెలిపారు. పోటీలు ముగించుకుని విజేతలుగా

నిలిచిన పారా స్విమ్మర్లు సోమవారం నాడు శాప్ చైర్మన్ రవి నాయుడు ని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులు తమ విజయ విశేషాలను, పోటీల అనుభవాలను చైర్మన్‌తో పంచుకున్నారు. అనంతరం రవి నాయుడు క్రీడా కారులను ప్రత్యేకంగా అభినందించి, వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శాప్ చైర్మన్ మాట్లాడుతూ.. పారా క్రీడాకారులలో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు, వారిని మరింత ప్రోత్సహించేందుకు శాప్ తరఫున అన్ని విధాలా అవసరమైన సహకారాన్ని, మౌలిక వసతులను అందిస్తామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో వీరంతా మరిన్ని కఠోర శ్రమతో అంతర్జాతీయ స్థాయిలో కూడా రాణించి, రాష్ట్రానికి మరియు దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో క్రీడా శాఖ అధికారులు, కోచ్‌లు మరియు క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గండి చెరువు ధోబీఘాట్‌కు కనీస వసతులు కల్పించాలి

- తహసీల్దార్‌కు రజక సంఘం వినతిపత్రం

- నిరుపయోగంగా మారిన ఘాట్.. జీవనోపాధి కోల్పోతున్నాం: రజకులు ఆవేదన

టీ.నర్సాపురం, జూన్ 15:(ప్రజా వీక్షణం)

ఏలూరు జిల్లా టీ. నరసాపురం మండలంలోని గండిగూడెం గ్రామంలో గల గండి చెరువు ధోబీఘాట్‌ను తక్షణమే పునరుద్ధరించి, బట్టలు ఉతుక్కోవడానికి అవసరమైన కనీస వసతులు కల్పించాలని స్థానిక రజక సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం రజక సంఘం ప్రతినిధులు టీ.నర్సాపురం మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌కు ఒక వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రజక సంఘం నాయకులు మాట్లాడుతూ.. గత కొన్ని దశాబ్దాలుగా గండి చెరువు ధోబీఘాట్ నిరుపయోగంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస నీటి సౌకర్యం కూడా లేకపోవడంతో తమ సాంప్రదాయ వృత్తిని కొనసాగించడం అత్యంత కష్టతరంగా మారిందని, దీనివల్ల అనేక కుటుంబాలు జీవనోపాధిని కోల్పో తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ధోబీఘాట్‌ను ఆధునీకరించాలని, నిరంతర నీటి సరఫరాకు ఏర్పాట్లు చేసి తమ జీవనోపాధిని కాపాడాలని వారు కోరారు. ధోబీఘాట్ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలను తక్షణమే నిలిపివేయాలని, చెరువు పరివాహక ప్రాంతంలో ఉన్న ఆక్రమణలను తొలగించి రజకులకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా వారు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో గండిగూడెం రజక సంఘం అధ్యక్షులు పొదిల రామారావు, కార్యదర్శి పొదిల లక్ష్మణరావు, కోశాధికారి పొదిల సత్యనారాయణ, సభ్యులు పొదిల రాంబాబు, పొదిల రాధాకృష్ణ, పొదిల రవి, పొదిల కృష్ణ, పొదిల చిన్ని, కొండపల్లి వెంకటేశ్వరరావు, నల్లజర్ల దుర్గాప్రసాద్, పొదిల బైరాగి, పొదిల రాము, పొదిల చిన్న లక్ష్మన్నయ్య, కొండపల్లి మంగరాజు, పొదిల నాగేశ్వరావు, వీరస్వామి, లక్ష్మీ నారాయణ, పొదిల మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

దెందులూరు ఘటనపై టీడీపీ అధిష్టానం సీరియస్ : ఈడ్పుగంటి శ్రీనివాస్ సస్పెన్షన్!

ఏలూరు జూన్ 15(ప్రజా వీక్షణం)

ఏలూరు జిల్లా దెందులూరు నియోజక వర్గంలో చోటుచేసుకున్న తాజా పరిణామాలపై తెలుగుదేశం పార్టీ (టీడీపీ) అధిష్టానం తీవ్రంగా స్పందించింది. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న టీడీపీ కార్యకర్త ఈడ్పుగంటి శ్రీనివాస్‌ను పార్టీ నుంచి తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటిం చింది. ఈ వ్యవహారానికి సంబంధించి ఏలూరు జిల్లా టీడీపీ కార్యాలయంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అత్యవసర మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ తీసుకున్న నిర్ణయాలను, తాజా పరిణామాలను పత్రికా ముఖంగా వెల్లడించారు. మీడియా సమావేశంలో బడేటి చంటి మాట్లాడుతూ, సోషల్ మీడియాలో జరుగుతున్న కొన్ని ప్రచారాలను ఖండించారు. "ఈడ్పుగంటి శ్రీనివాస్ అనే వ్యక్తి పార్టీ లీగల్ సెల్‌లో కీలక పదవిలో ఉన్నట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదు. అతను లీగల్ సెల్ పదవిలో లేడు, కేవలం ఒక సాధారణ కార్యకర్త మాత్రమే," అని బడేటి చంటి స్పష్టం చేశారు. పార్టీలో ఉంటూనే ప్రత్యర్థి పార్టీలకు కొమ్ముకాస్తున్న వారిపై నిఘా పెట్టామని జిల్లా అధ్యక్షుడు హెచ్చరించారు. సదరు వ్యక్తి వైసీపీ కోవర్ట్‌గా మారి లోపాయికారీగా కుట్రలు చేస్తున్న మాట వాస్తవమేనని, ఇందుకు సంబంధించి తమ వద్ద పక్కా ఆధారాలు ఉన్నాయని ఆయన మీడియాకు తెలిపారు. పార్టీ నమ్మకద్రోహాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోదని, అందుకే అధిష్టానం అతనిపై సస్పెన్షన్ వేటు వేసిందని పేర్కొన్నారు. దెందులూరు నియోజక వర్గ నేత చింతమనేని ప్రభాకర్ గురించి ప్రస్తావిస్తూ.. "రాజకీయం కన్నా తన వ్యక్తిత్వం, నమ్మకమే ముఖ్యం అనుకునే నాయకుడు చింత మనేని ప్రభాకర్. అయితే, ఈ కోవర్ట్ రాజకీయాలపై చర్యలు తీసుకోవటంలో మా వైపు నుంచి కొంత ఆలస్యం జరిగింది" అని బడేటి చంటి అంగీకరించారు. ఇకపై పార్టీ క్రమ

శిక్షణను ఉల్లంఘించే వారిపై, కోవర్ట్ చర్యలకు పాల్పడే వారిపై మరింత కఠినంగా వ్యవహరిస్తామని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలి

దేవరకద్ర జూన్ 15 ప్రజా విక్షణం

గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కార్మిక సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కారం చేయాలని కోరుతూ నియోజకవర్గం పరిధిలో కౌకుంట్ల మండల కేంద్రంలో తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ కార్మిక సంఘం టి యు సి ఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా కౌకుంట్ల మండలంలోని గ్రామాలు పంచాయతీలో పనిచేస్తున్న మల్టీపర్పస్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎండిఓ తాహసిల్దారుకు ఒక వినతిపత్రం సమర్పించారు. టి యు సి ఎ జిల్లా కార్యదర్శి సాంబశివుడు బాలరాజు చెన్నమ్మ అంజమ్మ లక్ష్మమ్మ తిరుపతయ్య శీను వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం

- పురపాలక సంఘ కమిషనర్ ఏసుబాబు



తాడేపల్లిగూడెం ప్రతినిధి జూన్ 15 (ప్రజా వీక్షణం)

ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని పుర పాలక సంఘ కమిషనర్ ఎం. ఏసుబాబు తెలిపారు. తాడేపల్లి గూడెం పురపాలక సంఘంలో పీజీఆర్ఎస్ (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ) కార్యక్రమాన్ని సోమవారం పురపాలక సంఘ కమిషనర్ ఏసుబాబు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతిపత్రాలను కమిషనర్ స్వయంగా స్వీకరించారు. తాగునీటి సరఫరా, మురుగు కాలువల నిర్వహణ, రహదారుల మరమ్మతులు, వీధి దీపాల ఏర్పాటు, ఇంటి పన్నులు, పారిశుధ్య సమస్యలు తదితర అంశాలపై వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు పంపించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించా లనిఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఏసుబాబు మాట్లాడుతూ ప్రజా

సమస్యల పరిష్కారానికి పురపాలక సంఘం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా స్వీకరించి, త్వరితగతిన పరిష్కరించడం పురపాలక సంఘం కర్తవ్యమని పేర్కొన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా అందిన ప్రతి దరఖాస్తుకు రసీదు జారీ చేసి, దాని పరిష్కార స్థితిని తెలుసుకునే విధంగా ట్రాకింగ్ వ్యవస్థ అమలులో ఉందని వివరించారు. పురపాలక సంఘ శాఖాధిపతులు, అధికారులు మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను నేరుగా కమిషనర్ దృష్టికి తీసుకొచ్చి తక్షణ పరిష్కారానికి అవసరమైన చర్యలు పొందవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ రవి సుధాకర్, డిఈ వెంకటరమణ, ఐసిడిఎస్ సూపర్వైజర్ భవాని తదితరులు పాల్గొన్నారు.

దేవాలయంలో భక్తులకు అన్నదానం

దేవరకద్ర జూన్ 15 ప్రజా వీక్షణం

మండల కేంద్రంలోని స్థానిక ఈశ్వర వీరప్పయ్య స్వామి ఆలయంలో సోమవారం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన మల్లికార్జున్ సంగీత, మనోజ్ కుమార్ ఉమా దంపతులు, భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు కూడా అన్నదాన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ప్రతి వారం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది అని వారు తెలిపారు. తదుపరి అన్నదానం చేసిన వారికి అర్చకులు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసులు నాగరాజు, నాగభూషణం, సిబ్బంది వారు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల సమయస్ఫూర్తి: గంటల వ్యవధిలోనే తప్పిపోయిన వివాహిత ఆచూకీ లభ్యం!

- చిన్నారితో సహా ప్రాణాపాయం నుండి కాపాడిన జంగారెడ్డిగూడెం పోలీసులు

జంగారెడ్డిగూడెం:జూన్ 15(ప్రజా వీక్షణం)

తప్పిపోయిన ఓ వివాహితను జంగారెడ్డిగూడెం పోలీసులు అత్యంత వేగంగా స్పందించి, గంటల వ్యవధిలోనే ప్రాణాపాయం నుండి కాపాడారు. సమర్థవంతమైన పోలీసు సేవల ద్వారా ఆమెను, చిన్నారిని సురక్షితంగా కుటుంబ సభ్యుల చెంతకు చేర్చిన ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది.

ఘటన వివరాల్లోకి వెళ్తే...

ఏలూరు జిల్లా టి. నర్సాపురం మండలానికి చెందిన ఒక వివాహిత మహిళ తన చిన్నారితో సహా అకస్మాత్తుగా అదృశ్యమైనట్లు పోలీసులకు సమాచారం అందింది. విషయం తెలిసిన వెంటనే జంగారెడ్డిగూడెం ఎస్సై వీరప్రసాద్ తన సిబ్బందితో కలిసి అప్రమత్తమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, మహిళను సురక్షితంగా కాపాడడమే లక్ష్యంగా ప్రత్యేక దృష్టి సారించి రంగంలోకి దిగారు.

గంటల వ్యవధిలోనే ఆచూకీ:

పోలీసు సిబ్బంది సాంకేతిక పరిజ్ఞానం, స్థానిక సమాచారంతో గాలించగా.. గంటల వ్యవధిలోనే సదరు వివాహిత ఆచూకీ లభ్యమైంది. మనస్తాపంతోనో లేదా మరేదైనా కారణంతోనో ఆమె ఎలాంటి అగైత్యానికి పాల్పడకుండా, సకాలంలో స్పందించి ఆమె ప్రాణాలను కాపాడారు. అనంతరం బాధితురాలిని ఆమె రక్తసంబంధీకులకు సురక్షితంగా అప్పగించారు. మహిళతో పాటు చిన్నారిని కూడా ఎటువంటి ప్రమాదం జరగకుండా



వెనువెంటనే గుర్తించి, తమకు అప్పగించినందుకు బాధితురాలి కుటుంబ సభ్యులు ఎస్సై వీరప్రసాద్ కి, పోలీసు సిబ్బందికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. సమచారం అందిన వెంటనే స్పందించి, బాధ్యతాయుతంగా పనిచేసిన పోలీసుల వేగవంతమైన చర్యల పట్ల స్థానిక ప్రజల నుండి పెద్ద ఎత్తున ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

కాశి విశ్వనాథ స్వామి ఘనంగా రుద్రాభిషేకం

దేవరకద్ర జూన్ 15 ప్రజా విక్షణం

మండల కేంద్రంలోని స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఉన్న పరమేశ్వరునికి సోమవారం సోమవతి అమావాస్య సందర్భంగా కాశీ విశ్వనాథ స్వామికి విశేష ద్రవ్యంతో మహాన్యాస ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆల అర్చకులు హరి శంకరశర్మ, భక్తులు పాల్గొన్నారు.

వర్షాకాలం పట్ల అప్రమత్తంగా ఉండండి..

అధికారులకు అడిషనల్ కలెక్టర్ సూచన..

దేవరకద్ర జూన్ 15 ప్రజా వి క్షణం

వర్షాకాలం పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండేందుకు గ్రామాలలో ఎటువంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సూచించారు. సోమవారము వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ లో సమయంలో మాట్లాడారు. రానున్నది వర్షాకాలం సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కారం చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కోయిల్ సాగర్ ఇస్రాంపల్లి ముందస్తుగా ప్రజలకు వర్షాకాలం ఉన్నందుకు జాగ్రత్తలు తీసుకున్నందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అందుకు వైద్య అధికారులు ఎప్పటికప్పుడు సేవలు అందించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో తాహ సిల్దార్ మహ్మద్ హర్షద్, ఉప తహసిల్దార్ దీపిక,ఎంపీడీవో శ్రీనివాసరావు, వైద్య అధికారి శరత్ చంద్ర, హెడ్ కానిస్టేబుల్ రాజశేఖర్, వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

ప్రజావీక్షణం
దినపత్రిక

నూతన ఎస్సైని సన్మానించిన జిఎంఆర్ యువసేన సభ్యులు

దేవరకద్ర జూన్ 15 ప్రజా వి క్షణం

మండల కేంద్రంలో స్థానిక పోలీస్ స్టేషన్లో నూతన ఎస్ఐ గా పదవి బాధ్యతలు చేపట్టిన భాస్కర్ రెడ్డిని సోమవారము స్థానికఎమ్మెల్యే జిఎంఆర్ యువసేన సభ్యులు కిరణ్ కుమార్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, ప్రకాష్, తదితరులు శాలవతో ఘనంగా సన్మానించారు.

డీఎంహెచ్‌వో రాంకుమార్ కు వైద్యుల శుభాకాంక్షలు

- ప్రభుత్వ వైద్యుల సంఘం,
ఐఎంఏ ప్రతినిధుల శుభాకాంక్షలు

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 15 (ప్రజా వీక్షణం న్యూస్)

నూతన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ వో) గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ ఎస్.డి. రాంకుమార్ ను ప్రభుత్వ వైద్యులసంఘం (టీజీజీఏ) హనుమకొండ యూనిట్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్య ల సంఘం హనుమకొండ యూనిట్ అధ్యక్షుడు డాక్టర్ టి. మదన్మోహన్‌రావు ఆధ్వ ర్యంలో రాష్ట్ర కార్యదర్శి డా.. శ్రీకృష్ణారావు, కార్యదర్శి డా.. రాజారెడ్డి, డా..గౌతమ్ చౌహాన్, ఇతర కార్యవర్గ సభ్యులు డీఎంహెచ్‌వోను పుష్పగుచ్ఛంతో సత్కరించి అభినందనలు తెలియ జేశారు. అలాగే ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) కార్యదర్శి డాక్టర్ శిరీష్, మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ నరేష్ కూడా డాక్టర్ రాంకుమార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో ప్రజారోగ్య సేవల మెరుగుదలకు, వైద్య సేవల ను మరింత సమర్థవంతంగా అందించడంలో డాక్టర్ రాం కుమార్ నాయకత్వం కీలక పాత్ర పోషిస్తుందని ఈ సంద ర్భంగా వైద్యులు ఆశాభావం వ్యక్తం చేశారు. డీఎంహెచ్‌వో గా ఆయన విజయవంతంగా సేవలందించాలని ఆకాంక్షించారు.

త్వరితగతిన స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించిన టీడీపి నేత శీలం వెంకటేశ్వరరావు

వెలగపాడు జూన్ 15(ప్రజా వీక్షణం)

ఏలూరు జిల్లా టీ. నర్సాపురం మండలం వెలగపాడు పంచాయతీ వీరభద్రవరం గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యకు తక్షణ పరిష్కారం లభించింది. గ్రామంలోని తూర్పు వీధి మోటర్ వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఇటీవల పాడైపోవడంతో స్థానిక ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయాన్ని గ్రామ నాయకులు తెలుగుదేశం పార్టీ (టీడీపి) సీనియర్ నాయకులు శీలం వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. సమస్య తీవ్రతను అర్థం చేసుకున్న ఆయన వెంటనే స్పందించారు. తక్షణమే విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, గ్రామంలో నెలకొన్న ఇబ్బందులను వివరించారు. శీలం వెంకటేశ్వరరావు చొరవతో అధికారులు వెంటనే స్పందించి, శరవేగంతో కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేసి శనివారం (లేదా ఈరోజు) గ్రామంలో ఏర్పాటు చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించి, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ వేయించడానికి కృషి చేసిన టీడీపి సీనియర్ నాయకులు శీలం వెంకటేశ్వరరావుకు మరియు విద్యుత్ శాఖ అధికారులకు గ్రామ ప్రజలు, రైతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

విద్యార్థుల భవిష్యత్తే ప్రభుత్వ ధ్యేయం: డీవైఈఓ గురునాథం

- నందిగామ జెడ్పీ హైస్కూల్‌లో ఘనంగా పాఠశాలల పునఃప్రారంభోత్సవ ప్రెస్ మీట్
- ' తల్లికి వందనం' ఇకపై ఇంట్లో ఎంతమంది పిల్లలున్నా వర్తిస్తుంది
- విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ లిఆదేశాల మేరకు పక్కా ప్రణాళిక

నందిగామ, జూన్ 15 (ప్రజా వీక్షణం న్యూస్):

రాష్ట్రంలోని విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయడమే ప్రభుత్వ ప్రథమ లక్ష్యమని డివిజనల్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ (డీవైఈఓ) గురునాథం పేర్కొన్నారు. సోమవారం ఎన్టీఆర్ జిల్లా నందిగామ పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 2026-27 విద్యాసంవత్సరం పాఠశాలల పునః ప్రారంభోత్సవాన్ని పురస్కరిం చుకుని ఆయన ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల విద్యా ప్రమాణాలు, ప్రభుత్వ సంక్షేమ పథ కాల అమలుపై ఆయన సుదీర్ఘంగా చర్చించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యార్థుల కోసం విప్లవాత్మక పథకా లను అమలు చేస్తోందని డీవైఈఓ గురునాథం వివరించారు. "రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, బ్యాగులు, షూస్, యూనిఫాం, బెల్టులను ప్రభుత్వం సకాలంలో అందజేస్తోంది. ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా అన్ని వసతులతో ప్రభుత్వ బడులను తీర్చిదిద్దుతున్నాం." అని ఆయన స్పష్టం చేశారు. కేవలం చదువే కాకుండా, విద్యార్థుల్లో ప్రాథమిక నైపుణ్యాలైన చదవడం, రాయడం, చక్కటి దస్తూరి, మగ్గాలు నేర్పిం చడంతో పాటు పర్యావరణంపై ప్రత్యేక అవగాహన కల్పించాలని ఉపాధ్యాయు లను ఆదేశించారు. పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొ ందించిన 'స్ఫూర్తి బుక్'ను ఈ సంద ర్భంగా అందజేశారు. విద్యార్థులకు చదువుతో పాటు శారీరక దృఢత్వం కూడా ముఖ్యమని, అందుకోసం ఫిజి కల్ ఎడ్యుకేషన్ (పీఈ) పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఉపాధ్యాయులకు సూచిం చారు. విద్యా పథకాలతో సర్వతో ముఖాభివృద్ధి ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా ప్రవేశపెట్టిన పథకాల ద్వారా విద్యార్థులకు అన్ని విధాలా సహకారం అందుతుందని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చినట్లు డీవైఈఓ తెలిపారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర పథకం: ఈ పథకం ద్వారా విద్యార్థులకు విద్యాపరంగా ప్రభుత్వం నుంచి పూర్తి స్థాయి మద్దతు లభిస్తుంది. మనబడి మన భవిష్యత్తు: ఈ కార్యక్రమం కింద పాఠశాలల మౌలిక వసతుల కల్పనకు, ఆధునీక రణకు రావలసిన నిధులను ప్రభుత్వం త్వరలోనే విడుదల చేయనుంది. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం: బడి పిల్లలకు పోషకాలతో కూడిన, నాణ్యమైన రుచికరమైన భోజనాన్ని అందించడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. గతంలో అమలైన పథకంలో కుటుంబంలో కేవలం ఒక్క విద్యార్థికి మాత్రమే లబ్ధి చేకూరేదని, కానీ ప్రస్తుత ప్రభుత్వం ఆ నిబంధనను సవరించిందని డీవైఈఓ వెల్లడించారు. ఇకపై ఒక కుటుంబంలో ఎంతమంది పిల్లలు చదువుకుంటుంటే.. అంతమందికీ 'తల్లికి వందనం' కింద తలా రూ. 15,000 చొప్పున అందిస్తామని విద్యాశాఖ మంత్రి హామీ ఇచ్చారని ఆయన స్పష్టం చేశారు. ఈ నెలలో జరగబోయే ఇంటర్నేషనల్ యోగా డే (అంతర్జాతీయ యోగా దినోత్సవం) ను పురస్కరించుకుని విద్యార్థులకు తక్షణమే యోగా శిక్షణ తరగతులు ప్రారంభించాలని డీవైఈఓ గురునాథం పిలుపునిచ్చారు. ఇందుకోసం పాఠశాలల్లోని పీఈటీ లు ప్రత్యేక ప్రణాళికతో విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రెస్ మీట్‌లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది మరియు విద్యాశాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిష్కారంలో జాప్యానికి తావొద్దు

- ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి
- ప్రజావాణిలో 263 దరఖాస్తుల స్వీకరణ
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్





ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 15 (ప్రజా వీక్షణం న్యూస్)

ప్రజావాణి కార్యక్రమంలో అందిన పెండింగ్ దరఖాస్తుల ను సత్వరమే పరిష్కరించి ప్రజలకు త్వరితగతిన సేవలు అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా ప్రజల నుంచి అందిన దరఖాస్తుల నమోదు, పరిష్కార ప్రక్రియ పై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించిన వెంటనే వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను మరింత వేగ వంతం చేయాలని సూచించారు. దరఖాస్తుల నమోదు కోసం అవసరమైతే అదనపు కంప్యూటర్లు, సిబ్బందిని ఏర్పాటు చేసి రసీదుల జారీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమం ముగిసిన అనంతరం కూడా రసీదుల కోసం అర్జీదారులు నిరీక్షించాల్సిన పరిస్థితి లేకుండా సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రతి దర ఖాస్తును బాధ్యతా యుతంగా పరిశీ లించి, నిర్దేశిత గడువులోగా పరిష్కరిం చేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ ప్రజావాణి కార్య క్రమంలో వివిధ సమస్యలకు సంబం ధించిన మొత్తం 263 దరఖాస్తులు అందాయి. జిల్లా పరిధిలోని హనుమ కొండ, పరకాల రెవెన్యూ డివిజన్ కార్యాల యాల్లో నిర్వహించిన ప్రజా వాణి కార్యక్రమంలో ఆర్డీవోలు, సంబంధిత అధికారులు ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించా రు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రవి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, జెడ్పీ సీఈఓ శేషాద్రి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తోట గోపిపై విమర్శలు సరికాదు

- తెదేపా సీనియర్ నాయకుడు బొల్లిన రామకృష్ణ

తాడేపల్లిగూడెం ప్రతినిది జూన్ 15 (ప్రజా వీక్షణం),

ప్రజా సమస్యల పరిష్కారానికి నిస్వార్థంగా కృషి చేస్తున్న సీనియర్ నాయకుడు తోట గోపిపై లేనిపోని అసత్య ప్రచారాలు చేయడం తగదని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, జగన్నాధపురం కర్ర చెరువు నీటి సంఘం అధ్యక్షుడు బొల్లిన రామకృష్ణ హితవుపలికారు. తాడేపల్లిగూడెం మండలంలోని జగన్నాధపురంలో సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కు లభిస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యలను పరిష్కరించి వారికి న్యాయం చేసే విధంగా తోట గోపి సుదీర్ఘకాలంగా కృషి చేస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ మాజీ అధ్యక్షులు మొగలపు రాజు, టిడిపి నాయకులు పేరిచర్ల వేంకట పతిరాజు, తమ్మాబత్తుల యేసు తదితరులు పాల్గొన్నారు.

టెట్ పరీక్షా కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు

- వరంగల్ పోలీస్ కమిషనర్

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 15 (ప్రజా వీక్షణం న్యూస్)

నేటి నుండి ప్రారంభం అయ్యే టెట్ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు పరీక్షా కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నట్లుగా వరంగల్ పోలీస్ కమిషన్ సన్ ప్రీత్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ పోలీస్ కమిషనర్ పరిధిలో నేటి నుండి మొదలుకొని 22వ తారీకు వరకు కొనసాగే టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) పరీక్షలకు సంబం ధించి పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 బి ఎన్ ఎస్ ఎస్ ప్రకారం నిషేధాజ్ఞలు అమలు చేయబడతాయని ఈ ఉత్తర ప్రకారం పరీక్ష జరిగే 500 మీటర్ల పరిధిలో ప్రజలు గుంపులుగా గుమి కూడటం, సభలు సమావేశాలు ర్యాలీ లు ధర్నాలు నిషేధించ బడ్డాయని, పరీక్ష జరిగే పరిసరాలలో పరీక్ష సమ యంలో జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని, ఈ ఉత్తర్వులు ఉదయం ఆరు గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుం దని ఎవరైనా ఈ ఉత్తర్వులు అతిక్రమిస్తే వారిపై చట్టపర మైన చర్యలు తీసుకోబడతా యనివరంగల్ పోలీస్ కమిషనర్ హెచ్చరించారు.

పల్స్ పోలియో, స్టాప్ డయేరియా, జాతీయ నులి పురుగుల నివారణ కార్య క్రమాలను విజయవంతం చేయాలి

- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి - జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 15 (ప్రజా వీక్షణం న్యూస్)

పోలియో నిర్మూలనతో పాటు చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా చేపడు తున్న పల్స్ పోలియో, స్టాప్ డయేరియా క్యాంపెయిన్, జాతీయ నులిపురుగుల నివారణ కార్య క్రమాలను అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని 0-5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పని సరిగా పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా వలస కార్మికులు నివసించే ప్రాంతాలు, ఇటుక బట్టీలు, నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతాలు వంటి అధిక ప్రమాద ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ నెల 28న నిర్వహించను న్న పల్స్ పోలియో కార్య క్రమాన్ని విజయవంతం చేసేందుకు బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ట్రాన్సిట్ పాయింట్ల తో పాటు అన్ని పోలియో కేంద్రాల్లో పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని సూచించారు. ప్రతి కేంద్రంలో ఆశా కార్యకర్తలు, అంగన్ వాడీ సిబ్బంది సమన్వయం తో పనిచేయాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో కార్య క్రమం విస్తృతంగా జరిగేలా స్వయం సహాయక సంఘాల సభ్యులు, స్వచ్ఛంద సంస్థ లు, ఎన్జీవోలు భాగస్వా మ్యం కావాలని కోరారు. జూన్ 29, 30 తేదీల్లో ఇంటింటి సర్వే నిర్వహించి, 0-5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డయేరి యా, దోమల ద్వారా వ్యాపిం చే వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాల ని కలెక్టర్ సూచించారు. నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి పారిశుధ్య చర్యలు చేపట్టాలని, ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంచాలని తెలిపారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. విద్యార్థుల్లో వ్యక్తిగత పరి శుభ్రత అలవాట్లు పెంపొందించేందుకు భోజనానికి ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవడం వంటి అంశాలపై ప్రత్యేక అవగాహ న కల్పించాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. జిల్లా వైద్య

ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాం కుమార్ మాట్లాడుతూ, జూన్ 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమంలో జిల్లాలోని 84,298 మంది 0-5 సంవత్సరాల పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం 472 పోలియో బూత్‌లు, మొబైల్ బృందా లు, ట్రాన్సిట్ పాయింట్లు, అధిక ప్రమాద ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి మాట్లాడుతూ, జూన్ 15 నుంచి జూలై 31 వరకు స్టాప్ డయేరియా క్యాంపెయిన్ నిర్వహిస్తున్న ట్లు తెలిపారు. ఆశా కార్య కర్తలు ఇంటింటికి వెళ్లి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలను పంపిణీ చేయడం తో పాటు డయేరియా నివారణపై అవగాహన కార్యక్రమాలు చేపడతారని వివరించారు. జూలై 13, 20 తేదీల్లో జాతీయ నులి పురుగుల నివారణ కార్య క్రమాన్ని నిర్వహించి, ఒకటి నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులంద రికీ ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేయ నున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రవి, డి ఆర్ ఓ శ్రీనివాస్, జెడ్పి సీఈఓ శేషాద్రి పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ, విద్యాశాఖ, గిరిజన సంక్షేమ, బీసీ సంక్షేమ, ఎస్సీ సంక్షేమ శాఖల అధికారులు, ఇంటర్మీడియట్ విద్యాశాఖ, సంబం ధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా నిలిచిన టీడీపీ నాయకుడు శీలం వెంకటేశ్వరరావు

వీరభద్రవరం జూన్ 15(ప్రజా వీక్షణం)

ఏలూరు జిల్లా టి. నర్సాపురం మండలం వెలగపాడు పంచాయతీ పరిధిలోని వీరభద్రవరం గ్రామానికి చెందిన చిన్ని గంగరాజు అనే వ్యక్తి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నట్లు స్థానిక గ్రామ నాయకులు తెలుగుదేశం పార్టీ (టీడీపీ) నాయకుడు శీలం వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే స్పందించిన శీలం వెంకటేశ్వరరావు సోమవారం బాధితుడి నివాసానికి చేరుకున్నారు. గంగరాజు ఆరోగ్య పరిస్థితిని ఆయన కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులతో ఫోన్ ద్వారా మాట్లాడి, మెరుగైన వైద్యం అందించాలని కోరారు. గంగరాజును తక్షణమే స్థానిక ఆసుపత్రిలో చేర్పించి, వైద్య సేవలు అందేలా చొరవ తీసుకున్నారు. కష్టకాలంలో తమకు అండగా నిలిచి, తక్షణమే ఆసుపత్రిలో చేర్పించిన టీడీపీ నాయకుడు శీలం వెంకటేశ్వరరావుకు బాధితుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

జడ్పీ హైస్కూల్ అభివృద్ధికి 'పీఎం శ్రీ' నిధులు: హెచ్ఎం పి. విజయలక్ష్మి

- క్రీడా మైదానం, ల్యాబ్స్ ఆధునికీకరణ

- శ్రీనివాస్ ఎడ్యుకేషనల్ సొసైటీ సౌజన్యంతో 10 కంప్యూటర్ల బహూకరణ

- పాఠశాల అభివృద్ధికి తల్లిదండ్రులు సహకరించాలి

నందిగామ, జూన్ 15 (ప్రజా వీక్షణం న్యూస్):

ఎన్టీఆర్ జిల్లా నందిగామ పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు (హెచ్ఎం) పి. విజయలక్ష్మి తెలిపారు. సోమవారం పాఠశాల ఆవరణలో ఆమె విలేకరుల సమావేశం నిర్వహించి, స్కూల్‌కు మంజూరైన నిధులు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'పీఎం శ్రీ' (ప్రైమ్ మినిస్టర్ స్కూల్స్ ఫర్ రైసింగ్ ఇండియా) పథకం కింద పాఠశాలలో క్రీడల అభివృద్ధికి రూ. 5 లక్షల నిధులు మంజూరయ్యాయని హెచ్ఎం తెలిపారు. ఈ నిధులతో పాఠశాల ఆట స్థలాన్ని (గ్రౌండ్) సమగ్రంగా బాగు చేయించామని, మట్టి తోలించి క్రీడా కారులకు అనుకూలంగా తీర్చిదిద్దామని వివరించారు. అలాగే స్పోర్ట్స్ మెటీరియల్‌తో పాటు సైన్స్ ల్యాబ్‌కు అవసరమైన అత్యాధునిక పరికరాలను కూడా సమకూర్చినట్లు పేర్కొన్నారు. పాఠశాలలో డిజిటల్ విద్యను ప్రోత్సహించేందుకు శ్రీనివాస్ ఎడ్యుకేషనల్ సొసైటీ వారు సౌజన్యంతో 10 కంప్యూటర్లను బహూకరించారని హెచ్ఎం విజయలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు. వీటితో పాటు విభిన్న కార్యక్రమాల (ఫండ్స్) కింద వచ్చిన నిధులతో పాఠశాలలో కిచెన్ గార్డెన్స్, దివ్యాంగుల కోసం ర్యాంప్‌లు, ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టామని.. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని వివరించారు. "రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యత ఇస్తోంది. ఉపాధ్యాయులమైన మేము విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ (కాన్సంట్రేషన్) పెడుతున్నాం. పాఠశాలలో మరింత ఉన్నతమైన విద్యా ప్రమాణాలు తీసుకురావడానికి ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు

కూడా మాకు పూర్తి స్థాయిలో సహకరించాలి." అని పి. విజయలక్ష్మి, హెచ్ఎం తెలిపారు. ఈ ప్రెస్ మీట్ ద్వారా పాఠశాల ప్రగతిని ప్రజల్లోకి తీసుకెళ్తున్న మీడియా మిత్రులకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న తీవ్రసంక్షోభానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి

- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వడ్డీ రఘురాం నాయుడు

తాడేపల్లిగూడెం ప్రతినిది జూన్ 15 (ప్రజా వీక్షణం)

ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభానికి అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వమే బాధ్యత వహించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తాడేపల్లిగూడెం నియోజకవర్గ సమన్వయకర్త వడ్డీ రఘురామ్ నాయుడు డిమాండ్ చేశారు. నరసాపురం నియోజకవర్గ పరిధిలోని మొగల్తూరు గ్రామంలో ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతం ఆక్వా రైతుల సమస్యలపై సోమవారం నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వడ్డీ రఘురాం మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా రొయ్య రైతుల కన్నీళ్లు ఈ ప్రభుత్వంలోనే చూస్తున్నామని, రొయ్యల ధరలు అమాంతం పడిపోయి రైతులు తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఆక్వాకు సబ్సిడీ విద్యుత్ ను ఎగ్గొట్టడమే లక్ష్యంగా చంద్రబాబు ప్రభుత్వం కొత్త ఎత్తుగడలు వేస్తుందని దుయ్యబట్టారు, చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఆక్వా రైతుల జీవితాలతో చెలాగాటమాడుతుందని విమర్శించారు. జీవో 169 ఆక్వా రైతులను వంచించేందుకే తప్పా వారికీ ఏ మాత్రం మేలు చేయదని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆక్వా జోన్, నాన్ ఆక్వా జోన్ లకు రూ 1.50 విద్యుత్ సబ్సిడీ ఇస్తామని హామీ ఇచ్చారని, ప్రభుత్వం ఏర్పడి రోజులు గడుస్తున్నాయే తప్పా హామీ మాత్రం అమలకు నోచుకోవటంలేదని ఎద్దేవాచేశారు. ఆక్వా రైతులకు న్యాయం జరిగే వరకు, వారికి అండగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిలబడటంతో పాటు పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు, ఆందోళన కార్యక్రమాలను చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



సమతుల్య ఎరువుల వినియోగంతో నేల ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చు

- కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ విస్తరణ విభాగం శాస్త్రవేత్త అర్చన

తాడేపల్లిగూడెం ప్రతినిది జూన్ 15 (ప్రజా వీక్షణం)

తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఖరీఫ్2026 సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని దెందులూరు గ్రామంలో ఖేత్ బచావో అభియాన్ (పొలాన్ని కాపాడుకుందాం) అనే అంశంపై సోమవారం రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ కె.అర్చన మాట్లాడుతూ సమతుల్య ఎరువుల వినియోగం వల్ల నేల ఆరోగ్యం పరిరక్షించబడటంతో పాటు పంట దిగుబడులు, నాణ్యత గణనీయంగా మెరుగుపడతాయని తెలిపారు. నేల పరీక్షల ప్రాముఖ్యతను వివరిస్తూ, నేలలోని పోషక స్థితిని తెలుసుకుని ఆ మేరకు ఎరువులను వినియోగించడం ద్వారా సాగు ఖర్చులు తగ్గించుకోవడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చని రైతులకు సూచించారు. అలాగే గ్రీన్ మ్యాన్యూరింగ్ (హరిత ఎరువుల పంటలు) ద్వారా నేలలో సేంద్రియ కార్బన్ శాతం పెరిగి భూసారం మెరుగుపడుతుందని, దీర్ఘకాలికంగా నేల ఉత్పాదకతను కాపాడుకోవడానికి ఈ పద్ధతి ఎంతగానో ఉపయోగకరమని వివరించారు. రైతులు శాస్త్రీయ సాగు విధానాలను అనుసరించి నేల ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన రైతులు పాల్గొని నేల ఆరోగ్య నిర్వహణ,సమతుల్య ఎరువుల వినియోగం, హరిత ఎరువుల ప్రయోజనాలపై తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

సమస్యను పరిష్కారం చేసిన గ్రామ సర్పంచ్ వ ట్టెం స్వప్న శివకుమార్

దేవరకద్ర జూన్ 15 ప్రజావిక్షణం

నియోజకవర్గ పరిధిలో చిన్నచింతకుంట మండల పరిధిలోని చిన్నవడ్డేమాన్ గ్రామములో గత పదేండ్లు గా ఎస్సి వాడాలో నిల్వ ఉన్న మురికి నీటి సమస్యను గ్రామ సర్పంచ్ ద్రుష్టికీ తీసుకెళ్లిన గ్రామస్తులు వెంటనే క్షేత్రస్థాయి పరిపాలన మరియు గ్రామీణ అభివృద్ధి

బాధ్యతలను నిర్వర్తించే నాయకులుగా పనిచేస్తున్న మన సర్పంచ్ వెంటనే నాగుల కాల్వను సోమవారం గ్రామ సర్పంచ్ వట్టెం సప్న శివకుమార్, జెసిబి ద్వారా పూడిక పనులు చేయించారు. గ్రామ సర్పంచ్ వట్టెం స్వప్న శివకుమార్ దీంతో మురికి నీటి నుండి అంటూ వ్యాధుల రోగాల భారిన పడకుండా సమస్యను వెంటనే తీర్చడంతో గ్రామస్తులు వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమములో ఉప సర్పంచ్ వినోద్,గ్రామ అధ్యక్షుడు అమరేష్ ,యూత్ అధ్యక్షుడు ప్రిన్స్,బిఎల్ఏ దయానంద్,గ్రామ పెద్దలుఏ రాజు దావీదు ,జి.సుదర్శన్,పి .చందు , ఎస్ వెంకటేష్ , మహేందర్ జార్జి తదితరులు పాల్గొన్నారు.

కట్న వేధింపులు తాళలేక యువతి ఆత్మహత్యాయత్నం చికిత్స పొందుతూ మృతి

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 15 (ప్రజా వీక్షణం న్యూస్)

అదనపు కట్నం కోసం అత్తింటి వేధింపులు భరించలేక యువతి ఆత్మ హత్యాయత్నానికి పాల్పడి, చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, హుస్నాబాద్ గ్రామానికి చెందిన కంసాని రాజమల్లు (48) తన కుమార్తె ముస్కు ప్రవళిక (26)ను సిద్ధాపురం గ్రామానికి చెందిన ముస్కు శ్రీకాంత్‌కు వివాహం చేశారు. వివాహం అనంతరం అదనపు కట్నంగా రూ.5 లక్షలు, బంగారం తీసుకు రావాలంటూ భర్త శ్రీకాంత్, అత్త ముస్కు సీత, ఆడ పడుచులు ముస్కు రజని తదితరులు వేధింపులకు గురిచేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వేధింపులు తట్టుకోలేక ప్రవళిక ఈ నెల 11న ఎలుకల మందు సేవించి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం హనుమకొండలోని రోహిణి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం 7.30 గంటలకు ప్రవళిక మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతురాలి తండ్రి కంసాని రాజమల్లు ఫిర్యాదు మేరకు హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌లో అత్త ముస్కు సీత, భర్త ముస్కు శ్రీకాంత్, ఆడపడుచులు ముస్కు రజని తదితరులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కేసును ఎస్ఐ పి. గోవర్ధన్ దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజావీక్షణం
దినపత్రిక

జోనుబోయిన సోంబాబు ఆధ్వర్యంలో అప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు జన్మదిన వేడుకలు

- టి. నరసాపురంకార్యాలయం వద్ద ఘనంగా కేక్ కట్ చేసిన సొసైటీ చైర్మన్, డైరెక్టర్లు

టి. నరసాపురం, జూన్ 15:(ప్రజా వీక్షణం)

ఏలూరు జిల్లా టి. నరసాపురం మండలం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయం వద్ద అప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. టి. నరసాపురం సొసైటీ చైర్మన్ మరియు క్లస్టర్ ఇంచార్జ్ జోనుబోయిన సోంబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ జోనుబోయిన సోంబాబు మాట్లాడుతూ.. సహకార రంగ బలోపేతానికి అప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు అందిస్తున్న సేవలను కొనియాడారు. ఆయన మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ జన్మదిన వేడుకల్లో సొసైటీ పాలకవర్గ సభ్యులు, సొసైటీ సిబ్బంది మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు. పాల్గొన్న వారిలో: సోసైటీ డైరెక్టర్ లు మోదుగు రామారావు, ఉయ్యూరు నాగమణి, కిలారు సాంబశివరావు, సందేపూడి పాణి, రాచబంటు వేములయ్య, వీరంకి సత్యనారాయణ, ఉయ్యూరు నాగేశ్వరరావు. ముఖ్య నాయకులు: జోనుబోయిన శేషారావు, భైగాని వెంకటేశ్వరరావు, ఆల వెంకట్.సొసైటీ అధికారి సీఈఓ సోల సత్యనారాయణ అలాగే సొసైటీ డైరెక్టర్లతో పాటు పలువురు రాజకీయ నాయకులు, కార్యకర్తలు పాల్గొని గన్ని వీరాంజనేయులుకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

- ఉద్యాన విశ్వవిద్యాలయం ఉప కులపతి, డాక్టర్ ధనుంజయరావు

తాడేపల్లిగూడెం ప్రతినిధి జూన్ 15 (ప్రజా వీక్షణం)

విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయం ఉప కులపతి డాక్టర్ కె.దనుంజయ రావు సూచించారు. తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలోని వర్శిటీ ప్రాంగణంలోని ఉద్యాన కళా శాలలో డ్రోన్ సాంకేతికతపై విద్యా ర్థులకు నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఉప కులపతి దనుంజయరావు మాట్లాడుతూ ఉద్యాన పంటల పర్య వేక్షణ, భూభాగ పటాల తయారీ, పరిశోధన కార్యకలాపాలు, పంటల నిర్వహణ వంటి రంగాల్లో డ్రోన్ సాంకే తికతకు విశేష ప్రాధాన్యత ఉందని తెలిపారు. ఆధునిక వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో విద్యా ర్థులు డ్రోన్‌ల వినియోగంపై అవగాహనతో పాటు ప్రాయోగిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. భవిష్యత్తులో డ్రోన్ ఆధారిత సేవలు, పరిశోధన, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసు కోవాలని పిలుపునిచ్చారు. విశ్వ విద్యాలయ ఉద్యానశాఖ డీన్ డాక్టర్ బి.ప్రసన్న కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు డ్రోన్ సాంకేతికతలో ప్రాయోగిక పరిజ్ఞానాన్ని అందించేం దుకు ఈ శిక్షణ కార్యక్రమం ఎంత గానో దోహదపడుతుందని తెలిపారు. వ్యవసాయ, ఉద్యాన రంగాల్లో వేగంగా విస్తరిస్తున్న డ్రోన్ సాంకేతికతపై విద్యార్థులు సమగ్ర అవగాహన పొం దేందుకు ఈ కార్యక్రమం ఉపయోగ

పడుతుందని వివరించారు. ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎన్.బి.వి. చలపతిరావు, ప్రాజెక్టు ప్రధాన పరిశోధకులు డాక్టర్ బి.ఎం. చెన్నకేశవులు, సహ పరిశోధకులు డాక్టర్ ఎన్. ఇమ్మాన్యుయేల్ మాట్లా డుతూ ఈ శిక్షణలో డ్రోన్‌ల నిర్మాణం, సిమ్యులేటర్ ఆధారిత శిక్షణ, ప్రత్యక్ష డ్రోన్ నిర్వహణ, డ్రోన్ ఎగరవేత, భద్రతా ప్రమాణాలు, నిర్వహణ పద్ధతులు తదితర అంశాలపై విద్యా ర్థులకు సమగ్ర శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యా పకులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారానికి ప్రత్యేక చొరవ

- బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు

- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 15 (ప్రజా వీక్షణం న్యూస్)

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ వాటి పరిష్కారా న్ని వేగవంతం చేసి బాధి తులకు సత్వర న్యాయం అందేలా చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ సంబంధిత శాఖల అధికారులు, పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నమోదైన అట్రాసిటీ కేసుల్లో పెండింగ్ లో ఉన్న వాటిని ప్రాధాన్యం గా తీసుకుని విచారణలను వేగవంతం చేయాలని సూచించారు. దర్యాప్తు పూర్తయిన కేసుల్లో చార్జి షీట్లు సకాలంలో దాఖలు చేసి న్యాయ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని పోలీసు అధికారులను ఆదేశించారు. 2023 నుంచి 2026 వరకు జిల్లాలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రా సిటీ కేసుల బాధితులకు ప్రభుత్వం నిబంధనల మేర కు మొత్తం రూ.67.45 లక్షల పరిహారం అందజేసినట్లు కలెక్టర్ తెలిపారు. బాధితుల కు ప్రభుత్వం కల్పిస్తున్న రక్షణ, సహాయ కార్యక్రమా లు మరింత సమర్థవంతంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్య క్రమాల్లో ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ప్రాధాన్యం కల్పించేలా చర్యలు తీసు కుంటామని పేర్కొన్నారు. ప్రతి నెల నిర్వహించే సివిల్ రైట్స్ డే కార్యక్రమాల్లో తహసీల్దార్లు, పోలీసు అధి కారులు, సంబంధిత శాఖల సిబ్బంది తప్పనిసరిగా పాల్గొని ప్రజల్లో చట్టాలపై అవగాహన పెంచాలని సూచించారు. ఏసిపి లు మాట్లాడుతూ అట్రాసిటీ కేసుల విషయంలో పోలీసు శాఖ వేగంగా స్పందిస్తూ దర్యాప్తు,

ఎఫ్ఐఆర్‌లు, చార్జి షీట్లు, విచారణలో ఉన్న కేసుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. బాధి తులకు న్యాయం అందేలా చట్ట పరమైన చర్యలను మరింత వేగ వంతం చేస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి, జిల్లా ఎస్సీ కార్పొ రేషన్ అధికారి సురేష్ కుమార్, ఏసీపీలు ప్రశాంత్ రెడ్డి, నరసింహారావు, ఆర్డీవో లు వెనటేశ్, వెంకన్న, తహసీల్దార్ సీహెచ్ రాజు, ఎన్జీవో ప్రతినిధులు డాక్టర్ పి. దామోదర్, పురుషోత్తం, నరసింహారావు, ఈవీ శ్రీనివాస్, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మొహర్రం ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి

- జిల్లా కలెక్టర్ డా. సత్య శారద

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 15 (ప్రజా వీక్షణం న్యూస్)

మొహర్రం పండుగను ప్రశాంతంగా, ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో మొహర్రం ఉత్సవాల ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య మాట్లాడారు. ఊరేగింపు మార్గాల్లో పారి శుద్ధ్యం, తాగునీటి సౌకర్యం, వీధి దీపాలు, నిరంతర విద్యుత్ సరఫరా, వైద్య శిబిరాలు, అగ్నిమాపక భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్ల ను ముందస్తుగా పూర్తి చేయాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. మత పెద్దలు సూచించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. మొహర్రం సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టి, ఊరేగింపులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా సజావుగా జరిగేలా చూడాలని పోలీసు అధి కారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వై.వి. గణేష్, డీఆర్‌వో విజయలక్ష్మి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి టి. రమేష్, వివిధ శాఖల అధికారులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

జూన్ 24న 'కళ్యాణమస్తు' సామూహిక వివాహాలు

-18 జంటలకు ఉచితంగా పెళ్లిళ్లు అర్హులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలి: - త్రిపురనేని గోపీచంద్

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 15 (ప్రజా వీక్షణం న్యూస్)

ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలిచే లక్ష్యంతో శివానంద మూర్తి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 24న 'కళ్యాణమస్తు' సామూహిక వివాహాలు నిర్వహించనున్నట్లు ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపీచంద్ తెలిపారు. హనుమకొండ బాలసముద్రం లోని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో సోమవారం నిర్వహిం చిన కార్యక్రమంలో సామూ హిక వివాహాల గోడపత్రికల ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ములుగు రోడ్డులోని సప్తధామంలో జూన్ 24వ తేదీ ఉదయం 8 గంటల నుంచి వివాహ వేడుకలు ప్రారంభ మవుతా యని చెప్పారు. శివానంద మూర్తి ట్రస్ట్ ఆధ్వర్యంలో 18 జంటలకు పూర్తిగా ఉచితం గా వివాహాలు జరిపించను న్నట్లు వెల్లడి ంచారు. వివాహం చేసుకోవాల నుకు నే అర్హత కలిగిన జంటలు వెంటనే దరఖాస్తు చేసుకోవా లని సూచించారు. ఆసక్తి గల వారు 98484 23133 నంబర్‌ను సంప్రదించి తమ వివరాలను నమోదు చేసుకోవచ్చు న్నారు. వధూవరులు, వారి కుటుంబ సభ్యులకు ఎలాంటి ఇబ్బం దులు కలగకుండా అన్ని ఏర్పాట్లు ట్రస్ట్ పర్య వేక్షణలో సమన్వయంతో నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. సామాజిక సేవా దృక్పథంతో చేపడుతున్న ఈ కార్య క్రమం ద్వారా పేద కుటుంబాలకు చేయూత అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగు తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టీలు బండారు సాయినారాయణ, మాదారపు సదాశివుడు, గంధే ఉమాశంకర్, రేపాల రాంచందర్, లాయక్, మంథెన వెంకటరమణ, కైరీక రవీందర్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజలు సహకరించాలని నిర్వాహకులు కోరారు.

ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగంగా పుంత రోడ్‌లో ప్రత్యేక పారిశుధ్య చర్యలు

తాడేపల్లిగూడెం ప్రతినిధి జూన్ 15 (ప్రజా వీక్షణం)

తాడేపల్లిగూడెం పురపాలక సంఘ కమిషనర్ ఎం.ఏసుబాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో భాగంగా సోమవారం 1వ వార్డులోని పుంత రోడ్ ప్రాంతంలో గుర్తించిన గార్బేజ్ వల్నరబుల్ పాయింట్లు (చెత్త పేరుకుపోయే ప్రాంతాలు) వద్ద అధికారులు, సిబ్బంది విస్తృత స్థాయిలో శుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. అక్రమంగా పేరుకుపోయిన చెత్తను జేసీబీలు, ట్రాక్టర్ల సహాయంతో పూర్తిగా తొలగించి, పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం దుర్వాసనలు, దోమల వ్యాప్తి నివారణకు ప్రత్యేక క్రిమిసంహారక మందులను పిచికారీ చేశారు. ప్రజలకు అవగాహన కల్పిస్తూ, గృహ చెత్తను నిర్దేశిత చెత్తబుట్టల్లోనే వేయాలని, రహదారులపై, ఖాళీ స్థలాల్లో, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకూడదని అధికారులు సూచించారు. ప్రజల సహకారంతోనే పట్టణాన్ని స్వచ్ఛంగా ఉంచగలమని, ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. స్వచ్ఛ సర్వేక్షణ2026 లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని పట్టణంలోని అన్ని గార్బేజ్ వల్నరబుల్ పాయింట్లను గుర్తించి, వాటిని పూర్తిగా తొలగించడంతో పాటు తిరిగి చెత్త వేయకుండా సీసీ కెమెరాలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నామని అధికారులు వివరించారు.

ప్రజావీక్షణం
దినపత్రిక
GENERAL NEWS
16 మంగళవారం, జూన్ 2026
3
www.prajaveekshanam.in

జిల్లాకు 8 రాష్ట్ర స్థాయి అవార్డులు సాధించిన సందర్భంగా కలెక్టర్‌కు ఘన సన్మానం

- రెడ్ క్రాస్ సేవలకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు రావడం జిల్లాకు గర్వకారణం

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 15 (ప్రజా వీక్షణం న్యూస్)

ప్రపంచ రక్తదాత దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రెడ్ క్రాస్ సొసైటీ ప్రకటించిన రాష్ట్ర స్థాయి అవార్డుల్లో హనుమకొండ జిల్లా 8 అవార్డులను కైవసం చేసుకుని విశేష ప్రతిభ కనబరిచిన నేపథ్యంలో, సోమవారం హనుమకొండ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్‌ను అధికారులు, రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఇ.వి. శ్రీనివాస్ రావు శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలో స్వచ్ఛంద రక్తదాన ఉద్యమాన్ని ప్రజల భాగస్వామ్యంతో విస్తృత స్థాయిలో నిర్వహించడం వల్లే రాష్ట్ర స్థాయిలో ఈ గుర్తింపు లభించిందని కలెక్టర్ తెలిపారు. రక్తదానం ద్వారా ప్రాణాలను కాపాడే మహోన్నత సేవలో భాగస్వాములైన స్వచ్ఛంద రక్తదాతలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ శాఖలు, పోలీసు విభాగం, సామాజిక సేవా సంస్థలు, రెడ్ క్రాస్ సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. హనుమకొండ రెడ్ క్రాస్ రక్తకేంద్రం రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించడం ఆనంద దాయకమని, రాబోయే రోజుల్లో ప్రథమ స్థానంలో నిలిచేలా జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుంద ని పేర్కొన్నారు. జిల్లాలో రక్త కొరత లేకుండా స్వచ్ఛంద రక్తదాన శిబిరాలను మరింత విస్తృతంగా

నిర్వహించేందు కు చర్యలు చేపడతామని చెప్పారు. రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఇ.వి. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ, జిల్లా సాధించిన విజయాలు రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచాయని అన్నారు. రక్తదాన ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసేందుకు జిల్లా యంత్రాంగం అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్య క్రమంలో జిల్లా అధికారులు, ఏసీపీ లు, ఆర్డీఓ లు, రెడ్ క్రాస్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

పోలవరం పంచాయతీలో 'ఇమ్మిగ్రేషన్ ఫారాల' పంపిణీ షురూ!

- ఎలక్షన్ కమిషన్ ఆదేశాలతో రంగంలోకి యంత్రాంగం

- ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తున్న అధికారులు, నేతలు

పోలవరం, జూన్ 15 (ప్రజా వీక్షణం):

ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు పోలవరం మండల పరిధిలోని స్థానిక పంచాయతీలో ఇమ్మిగ్రేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమం సోమవారం అత్యంత చురుగ్గా ప్రారంభమైంది. ఇందులో భాగంగా మొదటి రోజు కార్యక్రమాన్ని పురస్కరించుకుని పంచాయతీ మాజీ వైస్ ప్రెసిడెంట్ కె. శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఈ ఫారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అర్హులైన ప్రతి కుటుంబానికి ఈ ఫారాలు చేరేలా ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. ప్రజలు ఈ ఫారాల ప్రాముఖ్యతను తెలుసుకుని, ఎలాంటి తప్పులు లేకుండా సక్రమంగా నింపాలని ఆయన సూచించారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గ పరిధిలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పంచాయతీ పరిధిలోని అన్ని వార్డుల్లోనూ ఈ పంపిణీ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నిర్వాహకులు స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ సేవలు, నిబంధనలు అర్హులందరికీ సజావుగా అందేలా చూసేందుకే ఈ కార్యక్రమమని వెల్లడించారు. మొదటి రోజే ప్రజల నుంచి ఈ ప్రక్రియకు విశేష స్పందన లభించిందని శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ పంపిణీ కార్య

క్రమంలో స్థానిక వీఆర్వో బుచ్చమ్మ, మాజీ వైస్ సర్పంచ్ కొరశిక శ్రీనుతో పాటు పలువురు వార్డు ప్రతినిధులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిర్పూర్ పేపర్ మిల్లులో గుర్తింపు ఎన్నికలు వెంటనే నిర్వహించాలి...

తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) డిమాండ్..

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జూన్ 15 (ప్రజా వీక్షణం న్యూస్)

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ సిర్పూర్ పేపర్ మిల్ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో గుర్తింపు కార్మిక సంఘం వెరిఫికేషన్ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు 27వ రోజుకు చేరుకున్న సందర్భంగా తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ కార్మికులు సంఘీభావం ప్రకటించి దీక్షా శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ. శంకర్ మాట్లాడుతూ, సిర్పూర్ పేపర్ మిల్లులో గుర్తింపు కార్మిక సంఘం వెరిఫికేషన్ ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల కార్మికులు విధి నిర్వహణలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నాలుగు లేబర్ కోడ్లను అడ్డం పెట్టుకొని దేశవ్యాప్తంగా యాజమాన్యాలు కార్మికులను కట్టుబాని సలుగా మార్చే ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించారు. అందులో భాగంగానే సిర్పూర్ పేపర్ మిల్ యాజమాన్యం గుర్తింపు సంఘం ఎన్నికలు జరగకుండా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసి అడ్డుకుందని ఆరోపించారు. రానున్న రోజుల్లో లేబర్ కోడ్ల అమలుతో కార్మికుల హక్కులపై మరింత దాడి జరిగే ప్రమాదం ఉందని, అందుకే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలను యాజమాన్యం అడ్డుకుంటోందని అన్నారు. కార్మికులంతా ఐక్యంగా పోరాడి ఎన్నికలు

నిర్వహించే వరకు ఉద్యమాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. సిర్పూర్ పేపర్ మిల్ కార్మికుల న్యాయమైన పోరాటానికి మున్సిపల్ కార్మికుల పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు ఆర్. త్రివేణి, యూనియన్ నాయకులు సంజీవ్, రమేష్, మల్లేష్, సిర్పూర్ పేపర్ మిల్ మజ్దూర్ యూనియన్ ఉపాధ్యక్షులు అంగల శ్రీనివాస్, సహాయ కార్యదర్శి వెంకటేష్, ఇతర నాయకులు మరియు కార్మికులు పాల్గొన్నారు.

దేశంలోనే అతిపెద్దది మద్యం కుంభకోణం

- ఇందులో 50మందికి పైగా ముద్దాయిలు

జగన్ ప్రధాన సూత్రధారి అంటూ

- మంత్రి రవీంద్ర విమర్శలు

అమరావతి,జూన్15 (ప్రజా వీక్షణం)

ఏపీ లిక్కర్ స్కాం భారతదేశంలోనే అతిపెద్ద కుంభకోణమని ఏపీ ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు. ఈ కుంభకోణంలో 50మందికి పైగా ముద్దాయిలు ఉన్నారని తెలిపారు. మద్యం కుంభకోణంలో సూత్రదారులెవ్వరూ తప్పించుకోలేరని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు. ఇందులో ప్రధాన దోషి జగన్ అంటూ వైసిపి అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి కొల్లు రవీంద్ర తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం అమరావతి వేదికగా మంత్రి కొల్లు రవీంద్ర మీడియాతో మాట్లాడారు. జగన్ నేతృత్వంలో జరిగిన అక్రమాల్లో మరిన్ని అసలు వాస్తవాలు త్వరలోనే బయటకు వస్తాయని చెప్పుకొచ్చారు. ఈడీ కూడా దీనిపై విచారణ చేపట్టడంతో కొత్త పేర్లు కూడా బయటకు వస్తాయని తెలిపారు. అస్తవ్యస్త విధానాలతో ఎక్సైజ్ శాఖను వైసీపీ ప్రభుత్వం నాశనం చేసిందని ధ్వజమెత్తారు. జగన్ ప్రభుత్వ విధానాలతో ప్రజల ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు ఎక్సైజ్ ఆదాయం గణనీయంగా పడిపోయిందని మండిపడ్డారు. సొంత బ్రాండ్ల ప్రమోషన్ కోసం నాణ్యమైన బ్రాండ్లను తొక్కేశారని దుయ్యబట్టారు. డిజిటల్ పేమెంట్లు లేకుండా పారదర్శకత దెబ్బతీశారని ÷ర్ అయ్యారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నూతన ఎక్సైజ్ పాలసీ ద్వారా వ్యవస్థను సరి చేశామని స్పష్టం చేశారు. మద్యం అక్రమాలపై సిట్ విచారణ పారదర్శకంగా జరుగుతోందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. కూటమి ప్రభుత్వం పారదర్శకంగా అమలు చేస్తున్న మద్యం పాలసీపై మాజీ మంత్రి జోగిరమేశ్ నేతృత్వంలో వైసీపీ నేతలు చెడ్డపేరు తీసుకురావాలని చూసి అడ్డంగా దొరికిపోయారని ఆగ్రహించారు. 13రకాల పరీక్షల తర్వాతే నాణ్యమైన మద్యాన్ని బయటకు పంపుతూ ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

బడుగులపెన్నిధి వంగవీటి మోహన్ రంగా

తాడేపల్లిగూడెం ప్రతినిది జూన్ 15 (ప్రజా వీక్షణం)

పేదలు, బలహీన వర్గాల పెన్నిధిగా వంగవీటి మోహన్ రంగా ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకోవటంతో పాటు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని పలువురు నాయకులు ప్రశంసించారు. రంగా మిత్రమండలి ఆధ్వర్యంలో స్థానిక గొల్లగూడెం సెంటర్లో రంగా కాంస్య విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ విజయవాడలో రంగా అభిమానుల్లో అధిక శాతం బడుగు బలహీన వర్గాలు, ముస్లిం వర్గాలకు చెందిన ప్రజలే ఉండేవారని తెలిపారు. రంగా రాష్ట్ర స్థాయిలో ప్రజల అభిమానం పొంది, ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఎదుగుతున్న క్రమంలో ఆనాటి రాజకీయ కుట్రలకు బలైపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రంగాను ఒక సామాజిక వర్గానికి చెందిన నాయకుడిగా ముద్ర వేసేందుకు ఎంతోకాలంగా ప్రయత్నం జరిగిందని, ప్రజలు మాత్రం కుల మతాలకు అతీతంగా ఆయనను అందరివాడుగా అభిమానిస్తున్నారని కొనియాడారు. రంగా ఆశయ సాధనకు, బడుగు వర్గాల సంక్షేమానికి అంకితభావంతో కృషి చేయాలని వక్తలు కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బిసి, ఓసీ,మైనార్టీ వర్గాలకు చెందిన నాయకులు పాల్గొని రంగాకు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పైబోయిన రఘు, బొడ్డు సాయి, ద్వారంపూడి వేణుగోపాల రెడ్డి, కట్టుబోయిన కృష్ణ ప్రసాద్, చాపల రమేష్, వర్తనపల్లి కాశి, నీలపాల దినేష్, మాకా శ్రీనివాస్, సజ్జా సుబ్బు, భోగిరెడ్డి రాము, దస్తగిరి, పీతల బుచ్చిబాబు, ఎంట్రపాటి రాజు, సింగం సుబ్బారావు, వాడవల్లి సుబ్బరాజు, శీలి వెంకటేశ్వర రావు, వీర్ల సత్యనారాయణ, పడాల శ్రీను, తెన్నేటి జగజ్జీవన్, యాళ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



గడువు ముగిసిన పురుగు మందులు స్వాధీనం

అన్నదాత ఆగ్రో సెంటర్‌పై టాస్క్ ఫోర్స్ దాడి

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 15 (ప్రజా వీక్షణం న్యూస్)

వర్ధన్నపేట పట్టణంలో రైతులకు విక్రయించేందుకు ఉద్దేశించిన గడువు ముగిసిన పురుగు మందులను అక్ర మంగా నిల్వ చేసినట్లు వచ్చిన సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ పోలీసులు అన్నదాత ఆగ్రో సెంటర్‌పై ఆకస్మిక దాడులు నిర్వ హించారు. ఈ దాడిలో సుమారు రూ.6,86,905 విలువైన గడువు ముగిసిన పురుగు మందులను అధి కారులు స్వాధీనం చేసు కున్నారు. రైతుల ఆరోగ్యం, పంటల భద్రతకు హానికరం గా మారే అవకాశం ఉన్న ఈ పురుగు మందులను నిల్వ ఉంచినట్లు గుర్తించిన అధి కారులు తదుపరి చర్యలు చేపట్టారు. ఈ కేసులో షాపు యజమాని రాపర్తి రాజును అదుపులోకి తీసుకుని కేసు నమోదు నిమిత్తం స్థానిక పోలీసులకు అప్పగించినట్లు సమాచారం. ఈ ఘటనపై సంబంధిత శాఖ అధికారు లు దర్యాప్తు కొనసాగిస్తున్నా రు. రైతులు వ్యవసాయ అవసరాల కోసం పురుగు మందులు కొనుగోలు చేసే సమయంలో గడువు తేదీల ను తప్పనిసరిగా పరిశీలిం చాలని అధికారులు సూచించారు.

నెల్లూరు జిల్లా సంగం మండలంలో విషాద ఘటన

విశ్రాంత ఉపాధ్యాయుడి కుటుంబం ఆత్మహత్య

నెల్లూరు,జూన్15 (ప్రజా వీక్షణం)

నెల్లూరు జిల్లా సంగం మండలంలో తీవ్ర విషాదకర ఘటన చోటుచేసుకుంది. మండల పరిధిలోని దువ్వూరు గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు తమ ఇంట్లోనే ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. మృతులను విశ్రాంత ఉపాధ్యాయుడు మధుసూదన్‌రావు, ఆయన భార్య రత్నావళి, మరియు వారి కుమారుడు సాయి సుకృత్‌గా పోలీసులు గుర్తించారు. మృతదేహాలను పరిశీలించి, స్వాధీనం చేసుకున్నారు. చేతులకు తాళ్లు కట్టేసి ఉండటంతో మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఘటనాస్థలిలో సూసైడ్ లెటర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, పూర్తి వివరాల కోసం విచారణ జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

ప్రజావీక్షణం
దినపత్రిక

కల్యాణ లక్ష్మి మరియు షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేసిన సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జూన్ 15 (ప్రజా వీక్షణం న్యూస్)

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో 239 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి మరియు షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసిన సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎక్కడా అవినీతికి ఆస్కారం లేకుండా పారదర్శకంగా ప్రభుత్వం అందించే ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమగ్ర ఓటరు సవరణ ప్రక్రియ జూన్ 25 నుండి మొదలవుతుందని, ఓటర్లందరూ సవరణ ప్రక్రియకు సహకరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాగజ్ నగర్ ఎమ్మార్వో మధూకర్, సర్పంచులు కుందారపు సుమన్, గజ్జి లింగయ్య, జాదవ్ రాజేందర్, కొండగుర్ల ప్రకాష్, కోట వేణు, నాయకులు పుల్ల అశోక్, దోతుల శ్రీనివాస్, ఫిర్సింగుల తిరుపతి, గణపతి, పెంటయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ నివాసంలో లోకేశ్ దంపతుల పూజలు

- మహాశివుడికి మహాన్యాసక రుద్రాభిషేకం నిర్వహణ

హైదరాబాద్,జూన్15 (ప్రజా వీక్షణం)

ఏపీ విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, ఆయన సతీమణి నారా బ్రాహ్మణి దంపతులు సోమవారం హైదరాబాద్‌లోని తమ నివాసంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విశిష్టమైన సోమవారం సందర్భంగా లోకేశ్ దంపతులు మహాశివుడికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయురారోగ్యాలు, రాష్ట్ర ప్రగతి, ప్రజా సంక్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రుత్విక్కుల వేదమంత్రాల నడుమ లోకేశ్, బ్రాహ్మణి దంపతులు ఎంతో భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు.రాష్ట్ర అభివృద్ధి, ప్రజల శ్రేయస్సు కాంక్షిస్తూ లోకేశ్, బ్రాహ్మణి శివారాధన చేశారు. మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం వేదోక్తంగా నిర్వహించారు. శివానుగ్రహం కోసం లోకేశ్ కుటుంబం ప్రత్యేక పూజలు చేశారు. ప్రజా సంక్షేమం, రాష్ట్ర సుభిక్షం కోసం మహాశివుడిని లోకేశ్ దంపతులు ప్రార్థించారు. మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం అనంతరం ప్రత్యేక హారతులు, ఆశీర్వచన కార్యక్రమాలు నిర్వహించారు.

వీంమంత్రి అనితపై వ్యాఖ్యలు దారుణం

గుడివాడ తక్షణం క్షమాపణలు చెప్పాల్సిందే

టిడిపి ఎపి అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు డిమాండ్

విశాఖపట్నం,జూన్15 (ప్రజా వీక్షణం)

మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌పై తెలుగుదేశం పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హోంమంత్రి వంగలపూడి అనితపై అమర్‌నాథ్ చేసిన వ్యాఖ్యలు మహిళా లోకాన్ని అవమానించేలా ఉన్నాయని ధ్వజమెత్తారు, సోమవారం విశాఖపట్నం వేదికగా పల్లా శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడారు. ఒక మహిళా మంత్రిని లక్ష్యంగా చేసుకుని వ్యక్తిగత దూషణలకు దిగడం వైసీపీ సంస్కారహీన, దివాళాకోరు రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. మహిళల గౌరవాన్ని దెబ్బతీసేలా అమర్‌నాథ్ వ్యాఖ్యలు ఉన్నాయని పల్లా శ్రీనివాసరావు ఆగ్రహించారు. మహిళా సాధికారత గురించి మాట్లాడే నైతిక అర్హత వైసీపీ నాయకులకు లేదని ధ్వజమెత్తారు. గొడ్డలి పార్టీ నేతల మాటల్లో మహిళల పట్ల గౌరవం, బాధ్యత పూర్తిగా లోపించాయని మండిపడ్డారు. గుడివాడ అమర్‌నాథ్ తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని బహిరంగ క్షమాపణ కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టంచేశారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ చేసిన మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జూన్ 15 (ప్రజా వీక్షణం న్యూస్)

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలికల) సర్ సిల్క్, మరియు బాలుర కాగజ్ నగర్ పాఠశాలల నందు బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించ బడింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాగజ్ నగర్ మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ హాజరు కావడం జరిగింది.ఈ సందర్భంగా నూతనంగా ఆరవ తరగతిలో చేరిన జోర్రిగల వైభవ శ్రీ అమ్మాయికి స్వాగతం పలికి, పాఠశాలకు ఆహ్వానించి పాఠ్య పుస్తకాలు అందిం చడం జరిగింది. ఈ సందర్భంగా ఎం ఈ ఓ మాట్లాడుతూ విద్యార్థులు ప్రభు త్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవా లని సూచించారు. అదేవిధంగా ఈ సంవత్సరం పదవ తరగతి ఫలితాలలో అత్యుత్తమ ఫలితాలు సాధించి నందుకు పాఠశాల ప్రధానోపాధ్యా యులకు మరియు ఉపాధ్యాయులకు అభినందనలు తెలియచేశారు.ఈ కార్య క్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయులు పాక శ్రీలత మరియు ఆత్రం ప్రమీల, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎపిలో పెట్టుబడులు పెట్టండి

- ఏపీకి 1,000 కి.మీ సుదీర్ఘ సముద్ర తీరం

- లాజిస్టిక్స్ పరంగా అనేక అనుకూలతలు

- హైవేలు, పోర్టులు, ఎయిర్ పోర్టులు, రైల్వే కనెక్టవిటీ

- ఆక్వాకల్చర్‌లో నంబర్ 1గా ఉన్న ఆంధ్రప్రదేశ్

- ఎపిని సందర్శించండి..పెట్టుబడులు పెట్టండి

- సింగపూర్‌లో ప్రముఖ సంస్థల ప్రతినిధులతో చంద్రబాబు భేటీ

అమరావతి,జూన్15 (ప్రజా వీక్షణం)

ఏపీకి 1,000 కి.మీ సుదీర్ఘ సముద్ర తీరం ఉందని.. లాజిస్టిక్స్ పరంగా అనేక అనుకూలతలు ఉన్నాయని సీఎం చంద్రబాబు తెలిపారు. హైవేలు, పోర్టులు, ఎయిర్ పోర్టులు, రైల్వే కనెక్టవిటీ ఉందని సీఎం చెప్పారు. లాజిస్టిక్స్ వ్యయం తగ్గించేందుకు ప్రణాళికతో పనిచేస్తున్నామన్నారు. హార్టికల్చర్‌పై లక్ష కోట్లు ఇన్వెస్ట్ చేయబోతున్నామని.. ఆక్వాకల్చర్‌లో నంబర్ 1గా ఉన్నామని వివరించారు. సింగపూర్ పర్యటనలో భాగంగా వివిధ ప్రముఖ సంస్థల ప్రతినిధులతో సీఎం చంద్రబాబు వరుసగా సమావేశాలు నిర్వహించారు. ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ఆయా సంస్థల ప్రతినిధులకు సీఎం వివరించారు. తొలిరోజు పర్యటనలో భాగంగా వైసీహెచ్ లాజిస్టిక్స్ గ్రూప్ హెడ్ ఆఫ్ ఆపరేషన్స్ సునీల్ నంబియార్‌తో చంద్రబాబు భేటీ అయ్యారు. సప్లై చైన్, లాజిస్టిక్స్ పార్కుల ఏర్పాటుపై గ్రూప్‌తో చర్చలు జరిపారు. ఆటోమేటెడ్, అత్యాధునిక సాంకేతికతతో కూడిన భారీ సప్లై చైన్ సిటీని ఏపీలో నిర్మించే అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ... ఆహార ఉత్పత్తులకు వాల్యూఎడిషన్ ద్వారా ఎగుమతులకు ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ఏపీలో అపార అవకాశాలు ఉన్నాయని... ప్రొడక్షన్‌లో కూడా పెట్టుబడులు పెట్టవచ్చన్నారు. 'ఏపీని సందర్శించండి... రాష్ట్రంలో ఉన్న పాలసీలు, అనుకూలతలు చూసి పెట్టుబడులు పెట్టండి' అంటూ సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. గూగుల్ క్లౌడ్ ఆసియా-పసిఫిక్ రీజియన్ అధ్యక్షుడు కరణ్ బజ్వాతో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అతిపెద్ద ఏఐ, డేటా సెంటర్, డిజిటల్ మౌలిక సదుపాయాల కేంద్రంగా తీర్చిదిద్దే అంశాలపై ఇరువురి మధ్య చర్చకు వచ్చింది. ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ గవర్నెన్స్ రంగాల్లో గూగుల్ భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేం దుకు ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వ సేవల్లో ఏఐ వినియోగంపై గూగుల్ క్లౌడ్ సహకారాన్ని సీఎం కోరారు. రియల్ టైమ్ గవర్నెన్స్ వ్యవస్థను మరింత శక్తిమంతం చేసేందుకు ఆధునిక క్లౌడ్ సాంకేతికతల వినియో గంపై చర్చించారు. ఏఐ, మెషిన్ లెర్నింగ్, క్లౌడ్ టెక్నాలజీలలో యువతకు భారీ స్థాయిలో నైపుణ్యాభి వృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ప్రతిపాదించారు. గూగుల్ క్లౌడ్‌తో కలిసి ఏఐ స్కిల్లింగ్, క్లౌడ్ సర్టిఫికేషన్ కార్యక్రమాలను విస్తరించా లని భావిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. విశ్వవిద్యాలయాలు, ఇంజి నీరింగ్ కళాశాలల్లో ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ కేంద్రాల ఏర్పాటుపై చర్చించారు. గ్రీన్ ఎనర్జీ రంగంలో రాష్ట్ర ప్రభుత్వ విజయాలను వివరిం చారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోన్న సంజీవని ప్రాజెక్టులో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు.

ప్రజావీక్షణం
దినపత్రిక

SPORTS/ BUSINESS

16 మంగళవారం, జూన్ 2026

www.prajaveekshanam.in

భారత్-ఏపై శ్రీలంక-ఏ జట్టు విజయం
సూపర్ ఓవర్‌లో శ్రీలంక ఏ జట్టు గెలుపు

భారత్-ఎతో జరిగిన సూపర్ ఓవర్‌లో శ్రీలంక-ఎ విజయం సాధించింది. ఇరు జట్ల మధ్య వన్డే మ్యాచ్ ఫలితం టై కావడంతో సూపర్ ఓవర్ పెట్టారు. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక 16/0 పరుగులు చేసింది. సహన్ అరాచ్చిగే 6లి, అవిష్క ఫెర్నాండో 9లి రన్స్ చేశారు. అనంతరం ఛేదనకు దిగిన భారత్ 10/0 పరుగులు మాత్రమే చేసింది. సూర్యాంశ్ 3లి, వైభవ్ సూర్యవంశీ 7లి రన్స్ చేశారు. టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ సిక్స్ హిట్టింగ్ సామర్థ్యం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఐపీఎల్‌లో తన భారీ సిక్సర్లతో వరల్డ్ క్లాస్ బౌలర్లు అయిన జస్ప్రీత్ బుమ్రా, ప్యాట్ కమిన్స్, కగిసో రబడా, మిచెల్ స్టార్క్, జోష్ హేజిల్ వుడ్, భువనేశ్వర్ కుమార్, మహమ్మద్ సిరాజ్‌లకు చుక్కలు చూపించాడు. ఇటీవల ముగిసిన ఐపీఎల్ 2026 సీజన్‌లో మొత్తం 72 సిక్స్‌లు బాది క్రిస్ గేల్ పేరిట ఉన్న 14 ఏళ్ల రికార్డ్‌ను బద్దలు కొట్టాడు. అలాంటి వైభవ్ సూర్యవంశీ తాజాగా ఒక్క సిక్స్ కొట్టలేక ఇబ్బంది పడ్డాడు. భారత్-ఏ ఓటమికి కారణమయ్యాడు. భారత్-ఏ జట్టులోనే డేంజరస్ హిట్టర్‌గా గుర్తింపు పొందిన వైభవ్ ఆపేరును నిలబెట్టుకోలేకపోయాడు. ముక్కోణపు వన్డే సిరీస్‌లో భాగంగా శ్రీలంక-ఏతో సోమవారం జరిగిన హోరాహోరీ మ్యాచ్‌లో భారత్-ఏ సూపర్ ఓవర్‌లో 6 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ఈ మ్యాచ్‌లో స్కోర్లు టై కావడంతో అంపైర్లు సూపర్ ఓవర్ ద్వారా ఫలితాన్ని తేల్చారు. అర్షద్ ఖాన్ వేసిన సూపర్ ఓవర్‌లో శ్రీలంక 16 పరుగులు చేసింది. అవిష్కా ఫెర్నాండో సిక్సర్ బాది భారీ స్కోర్ అందించాడు. నాలుగు బంతులు కట్టడిగా వేసిన అర్షద్ ఖాన్.. ఐదో బంతికి సిక్సర్ ఇచ్చుకున్నాడు. అనంతరం భారత్-ఏ సూపర్ ఓవర్‌లో 10 పరుగులే చేసి ఓటమిపాలైంది. వరుసగా మూడు బంతులాడిన సూర్యాన్ష్ షెడ్గే మూడు పరుగులే చేశాడు. ఒక్క బౌండరీ కొట్టలేకపోయాడు. చివరి మూడు బంతుల్లో వైభవ్ కూడా ఒక్క సిక్సర్ కూడా బాదలేకపోయాడు. ఒకే ఒక బౌండరీ బాదాడు. యార్కర్లతో వైభవ్‌ను శ్రీలంక బౌలర్లు కట్టడి చేశారు. వరుసగా మూడు బంతుల్లో రెండు సిక్సర్లు, బౌండరీ కొట్టాల్సి రావడంతోనే వైభవ్ ఒత్తిడికి గురైనట్లు తెలుస్తోంది. సూపర్ ఓవర్‌లో స్ట్రైక్ వైభవ్ తీసుకోవాల్సిందని, తొలి మూడు బంతుల్లో ఒక్క సిక్సర్ వచ్చినా.. ఛేజింగ్ సులువయ్యేదని ఫ్యాన్స్ కామెంట్ చేస్తున్నారు.

వైభవ్ సూర్యవంశీ వెనుక ఆరేళ్ల కఠిన శ్రమ

ఐపీఎల్ లాస్ట్ రెండు సీజన్లలో తన అద్భుతమైన బ్యాటింగ్‌తో అందరినీ ఆశ్చర్యపరిచిన యంగ్ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ సక్సెస్ వెనుక ఆరేళ్ల కఠిన శ్రమ దాగి ఉంది. కేవలం 15 ఏళ్ల వయసులోనే వరల్డ్ క్రికెట్ మోస్ట్ ఎక్సైటింగ్ బ్యాటింగ్ సెన్సేషన్‌గా మారిన వైభవ్, రీసెంట్ ఐపీఎల్ సీజన్లలో 237 ప్లస్ స్ట్రైక్ రేట్‌తో 776 రన్స్ చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఈ సూపర్ పర్ఫార్మెన్స్‌తో యూకే టూర్‌కు వెళ్లే ఇండియా టి20ఐ టీమ్‌కు సెలెక్ట్ అయ్యాడు. పాట్నాలోని తన అకాడమీలో ఎనిమిదేళ్ల వయసు నుంచి వైభవ్‌కు ట్రైనింగ్ ఇచ్చిన చైల్డ్‌హుడ్ కోచ్ మనీష్ ఓఝా అతని జర్నీ గురించి ఇంట్రెస్టింగ్ విషయాలు షేర్ చేశాడు. టెన్నిస్ బాల్ నుంచి హార్డ్‌బాల్ క్రికెట్‌కు మారినప్పటి నుంచి వైభవ్ రోజుకు కనీసం 600 బంతులు అంటే దాదాపు 100 ఓవర్లు ఫేస్ చేసేవాడని కోచ్ ఓఝా చెప్పాడు. ఉదయం 7.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నాన్‌స్టాప్‌గా ప్రాక్టీస్ సాగేది. ఫస్ట్ తానే స్వయంగా 200 నుంచి 300 బంతులు త్రోడౌన్స్ వేసేవాడినని, తాను అలసిపోతే సపోర్ట్ స్టాఫ్, వారు కూడా అలసిపోతే అకాడమీ బౌలర్లు వైభవ్‌కు బౌలింగ్ చేసేవారని తెలిపాడు. అందరూ అలసిపోయినా నెట్ సెషన్స్, బౌలింగ్ మెషిన్ల ద్వారా వైభవ్ తన బ్యాటింగ్ ప్రాక్టీస్ కంటిన్యూ చేసేవాడు. ఈ ఆరేళ్ల రిపీటెడ్ ట్రైనింగ్ వల్లే అతనిలో అద్భుతమైన మజిల్ మెమరీ, పవర్‌ఫుల్ బ్యాట్ స్వింగ్ క్రియేట్ అయ్యాయని విశ్లేషించాడు. సమస్తీపూర్ నుంచి రెండున్నర గంటల పాటు ట్రావెల్ చేసి వైభవ్ తన తండ్రి సంజీవ్‌తో కలిసి ఉదయం 5 గంటలకే పాట్నా అకాడమీకి వచ్చేవాడు. వైభవ్ కెరీర్ కోసం అతని పేరెంట్స్ ఎన్నో త్యాగాలు చేశారని కోచ్ గుర్తుచేసుకున్నాడు. వైభవ్ తల్లి ఆర్తి రోజు అర్ధరాత్రి 2 గంటలకే లేచి లంచ్ ప్రిపేర్ చేసేది. కేవలం వైభవ్, అతని తండ్రి కోసమే కాకుండా వారితో పాటు వచ్చే బౌలర్లు, అకాడమీలో పేద పిల్లల కోసం రోజు 10 నుంచి 15 మందికి సరిపోయే ఫుడ్ ప్యాక్ చేసి పంపేదని ఎమోషనల్ అయ్యాడు. పేరెంట్స్ ఫుల్ సపోర్ట్ వల్లే వైభవ్ ఈరోజు ఛాంపియన్ ప్లేయర్ అయ్యాడని స్పష్టం చేశాడు. వైభవ్ సూర్యవంశీ సక్సెస్ గ్రాఫ్ చూసిన తర్వాత ఇప్పుడు ఇండియా అంతటా పేరెంట్స్ తమ పిల్లలను క్రికెటర్లు చేయాలని డిసైడ్ అవుతున్నారు. ప్రస్తుతం ఐదేళ్ల చిన్న పిల్లలను కూడా అకాడమీకి తీసుకొస్తూ తమ బిడ్డను 'నెక్స్ట్ వైభవ్' లా మార్చాలని కోరుతున్నట్లు ఓఝా చెప్పాడు. వైభవ్ ఇప్పుడు ఇండియాలోని యంగ్ జనరేషన్‌కు ఒక రోల్ మోడల్, ఒక బిగ్ ఇన్‌స్పిరేషన్‌గా మారాడని సంతోషం వ్యక్తం చేశాడు. సరైన టెక్నికల్ పారామీటర్స్, కఠినమైన క్రమశిక్షణతో ఆడితే పాజిటివ్ రిజల్ట్స్ వస్తాయని వైభవ్ ప్రూవ్ చేశాడని కొనియాడాడు.

బ్రెజిల్ రికార్డును బద్దలుకొట్టిన జర్మనీ

2026 ఫిఫా వరల్డ్?కప్?లో మరో రికార్డ్ నమోదైంది. టోర్నీలో అత్యుత్తమ జట్లలో ఒకటైన జర్మనీ, ఐదుసార్లు ఛాంపియన్?గా నిలిచిన బ్రెజిల్ రికార్డ్?ను బద్దలు కొట్టింది. తాజాగా కురసావ్?పై జరిగిన మ్యాచ్?లోనే జర్మనీ ఆ అద్భుతమైన ఘనత సాధించింది. దీంతో ఫిఫాలో ప్రస్తుతం ఆ జట్టు అగ్రస్థానంలో కొనసాగుతోంది. టెక్సాస్ వేదికగా తాజాగా పసికూన కురసావ్?తో జర్మనీ తలపడింది. ఈ మ్యాచ్?లో ఆ జట్టుపై జర్మనీ 7- 1 భారీ తేడాతో విజయం సాధించి ఫిఫా 2026లో శుభారంభం చేసింది. అయితే ఈ మ్యాచ్?లో ఒకటి కాదు రెండు కాదు జర్మనీ ఏకంగా ఏడు గోల్స్ చేయడం విశేషం. ఈ క్రమంలోనే ఫిఫా వరల్డ్?కప్ చరిత్రలో అత్యధిక గోల్స్ చేసిన జట్టుగా జర్మనీ రికార్డు కొట్టింది. ఇదివరకు ఈ రికార్డు బ్రెజిల్? పేరిట ఉంది. ఆ జట్టు ఇప్పటిదాకా 238 గోల్స్ చేసింది. ఈ మ్యాచ్?కు ముందు జర్మనీ ఖాతాలో 232 గోల్స్ ఉండేవి. అయితే కురసావ్?పై ఆధిపత్యం ప్రదర్శించిన జర్మనీ రికార్డు స్థాయిలో ఏడుసార్లు బంతిని గోల్?లోకి పంపింది. దీంతో 239 గోల్స్?లో ఫిఫా హిస్టరీలో అత్యధిక గోల్స్ చేసిన జట్టుగా కొనసాగుతోంది. ఫిఫా వరల్డ్?కప్? చరిత్రలో బ్రెజిల్, జర్మనీ దేనికి అదే సాటి! ఈ టోర్నీలో ఇవి అత్యుత్తమ జట్లు. బ్రెజిల్ రికార్డు స్థాయిలో ఇప్పటిదాకా ఐదుసార్లు ఛాంపియన్ (1958, 1962, 1970, 1994, 2002)గా నిలిచింది.

ఏబీ డివిలియర్స్ రికార్డ్‌ను బద్దలకొట్టిన చాహల్

టీమిండియా లెగ్ స్పిన్నర్ యుజ్వేంద్ర చహల్ బంతితోనే కాకుండా బ్యాట్‌తో కూడా అద్భుతాలు చేయగలనని నిరూపించాడు. ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ కెవిన్ పీటర్సన్ విసిరిన వినూత్న బ్యాటింగ్ ఛాలెంజ్‌ను స్వీకరించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. సాధారణంగా తన స్పిన్ మాయాజాలంతో ప్రత్యర్థులను కట్టడి చేసే చహల్.. ఈసారి బ్యాట్‌తో బంతిని బౌండరీ బయటకు పంపించాడు. కేవలం 50 బంతుల్లోనే 100 పరుగులు చేయాలని, బౌలింగ్ గంటకు 81 కిలోమీటర్ల వేగంతో మొదలై.. ప్రతీ బంతికి ఒక మైలు చొప్పున పెరుగుతుందని పీటర్సన్ సవాల్ విసిరాడు. అంతేకాకుంబా బౌండరీ దూరాన్ని 40 మీటర్లకు తగ్గించాడు. ఈ వినూత్న నిబంధనలతో సాగిన ఈ పోరు ఆద్యంతం ఉత్కంఠ రేకెత్తించింది.తొలి బంతికే సిక్సర్ బాదిన చాహల్.. రెండో బంతిని కూడా సిక్సర్ తరలించాడు. అయితే మూడో బంతికి క్యాచ్ ఇవ్వగా ఫీల్డర్ వదిలేసాడు. ఈ అవకాశంతో చాహల్ చెలరేగాడు. అతని షాట్లకు పీటర్సన్ అవాక్కయ్యాడు. 8వ బంతికి చాహల్ ఔటైనప్పటికీ.. రూల్స్ ప్రకారం ఔటైనప్పుడు తిరిగి బ్యాటింగ్ చేసేందుకు అతని స్కోర్ నుంచి ఐదు పరుగులు తగ్గించారు. దాంతో చాహల్ స్కోర్ 26 పరుగులకు పడిపోయింది. 10 బంతులు ముగిసే సరికి చాహల్ 33 పరుగులు చేశాడు. ఆ తర్వాత దూకుడుగా ఆడిన చాహల్ 14 బంతుల్లోనే హాఫ్ సెంచరీ సాధించాడు. ఈ హాఫ్ సెంచరీని చాహల్ తనదైన శైలిలో సెలెబ్రేట్ చేసుకున్నాడు. పీటర్సన్ సైతం అతన్ని కౌగిలించుకొని అభినందించాడు. ఆ తర్వాత 16వ బంతికి మరో సిక్సర్ కొట్టే ప్రయత్నంలో చహల్ అవుటయ్యారు. దీనితో మరొక ఐదు పరుగులు కోల్పోవాల్సి వచ్చింది. 20వ బంతి ముగిసే సమయానికి చహల్ స్కోరు 56 పరుగుల వద్ద ఉంది. ఆ తర్వాత వరుస సిక్సర్లతో విరుచుకుపడి కేవలం 25 బంతుల్లోనే 90 పరుగుల మార్కును అందుకున్నాడు. చివరకు 29వ బంతిని ఆకాశమే హద్దుగా సిక్సర్ బాదిన చహల్ శతకం పూర్తి చేసుకున్నాడు. ఈ క్రమంలో సౌతాఫ్రికా విధ్వంసకర బ్యాటర్ ఏబీ డివిలియర్స్ పేరిట ఉన్న పాత రికార్డును చహల్ అధిగమించాడు. ఈ సవాలును పూర్తి చేయడానికి చహల్ ఏకంగా 17 సిక్సర్లు కొట్టాడు. ఇంకా 21 బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించి చరిత్ర సృష్టించాడు. ఈ సరదా సవాల్‌ను చాహల్ గెలిచినప్పటికీ.. ఐపీఎల్ 2026 సీజన్‌లో అతను తీవ్రంగా నిరాశపర్చాడు. 12 ఇన్నింగ్స్‌లో కేవలం 12 వికెట్లు మాత్రమే తీసాడు. పంజాబ్ కింగ్స్ తరఫున రెండు సీజన్లు ఆడిన చాహల్ మొత్తం 28 వికెట్లు తీసాడు.

మైదానంలో చూసే కోహ్లీ.. బయట ఉండే కోహ్లీ
మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి ఇంట్రెస్టింగ్ కామెంట్స్

ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మీద ఉన్న ఒక బిగ్గెస్ట్ మిత్ (అపోహ) గురించి మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశాడు. కోహ్లీతో కలిసి చాలా ఏళ్లు ట్రావెల్ చేసిన శాస్త్రి, విరాట్ క్యారెక్టర్ గురించి ఓపెన్ అయ్యాడు. కోహ్లీ అహంకారి, గర్వంతో ఊగిపోతాడు, ఒక మొండి పిల్లాడిలా బిహేవ్ చేస్తాడు అని అందరూ అనుకుంటారు. శాస్త్రి మాటల ప్రకారం ఇదంతా నిజమే కావచ్చు కానీ, అది కేవలం క్రికెట్ గ్రౌండ్ వరకు మాత్రమే పరిమితం. ఫీల్డ్ బయట కోహ్లీ కంప్లీట్ డిఫరెంట్ పర్సన్ అని శాస్త్రి చెప్పాడు. మ్యాచ్ స్టార్ట్ అవ్వగానే అగ్రెసివ్ మోడ్‌లోకి వెళ్లి, బయటకు రాగానే నార్మల్‌గా మారిపోయే ఆ స్విచ్ ఆన్, స్విచ్ ఆఫ్ క్వాలిటీ కోహ్లీలో తనకు చాలా ఇష్టమని వివరించాడు. న్యూజిలాండ్ బ్యాటింగ్ లెజెండ్ కేన్ విలియమ్సన్ ఇంటర్నేషనల్ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించడంతో విరాట్ కోహ్లీ ఎమోషనల్ అయ్యాడు. వీరిద్దరి స్నేహం 2008 అండర్-19 వరల్డ్ కప్ నుంచి కొనసాగుతోంది. 16 ఏళ్ల కెరీర్‌లో కివీస్ టీమ్ తరఫున 378 మ్యాచ్‌లు ఆడి ఎన్నో రికార్డులు క్రియేట్ చేసిన విలియమ్సన్‌ను క్రికెట్ వరల్డ్ మొత్తం గౌరవిస్తుంది. 2025లో టి20 ఇంటర్నేషనల్స్ నుంచి కూడా తప్పుకోవాలని కేన్ తీసుకున్న డెసిషన్ తర్వాత కోహ్లీ సోషల్ మీడియాలో స్పెషల్ మెసేజ్ పోస్ట్ చేశాడు. మైదానంలో ప్రత్యర్థిగా ఉన్నా, బయట మాత్రం తమ మధ్య ఉన్న ఫ్రెండ్‌షిప్ చాలా విలువైందని కోహ్లీ రాసుకొచ్చాడు. ఐపీఎల్‌లో కూడా కోహ్లీ, విలియమ్సన్ చాలా సార్లు పోటీ పడ్డారు. విలియమ్సన్ సన్‌రైజర్స్ హైదరాబాద్, లక్నో సూపర్ జెయింట్స్ టీమ్స్ కు ప్రాతినిధ్యం వహించగా, కోహ్లీ ఆర్సీబీ మెయిన్ ప్లేయర్‌గా ఉన్నాడు. "నీ బ్యాటింగ్ చూడటం, నీతో పోటీ పడటం నాకు ఎప్పుడూ ఒక ప్లెజర్. అంతకంటే ఎక్కువగా నీ స్నేహాన్ని, క్రికెట్ పై నీకు ఉన్న విజన్‌ను నేను గౌరవిస్తాను" అని కోహ్లీ చెప్పాడు. ఇప్పటి వరకు కేన్ క్రికెట్ కోసం తన వంతు కృషి చేశాడని, ఇకపై విశ్రాంతి తీసుకుంటూ లైఫ్ ఎంజాయ్ చేయాలని కోరుకుంటున్నట్లు తెలిపాడు. జీవితం ఇప్పుడే మొదలైందని, అతనికి ఎప్పుడూ ఆల్ ది బెస్ట్ అని తన మిత్రుడికి ఫేర్వెల్ ఇచ్చాడు.

కరుప్పు విజయంతో మరింత బిజీగా త్రిష రెమ్యునరేషన్ కూడా పెంచినట్లు టాక్

సౌత్ సినీ ఇండస్ట్రీలో రెండు దశాబ్దాలకు పైగా తన స్టార్‌డమ్‌ను నిలబెట్టుకున్న హీరోయిన్ త్రిష మరోసారి వార్తల్లో నిలిచారు. ప్రస్తుతం ఆమె రెమ్యూనరేషన్‌కు సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వరుస విజయాలతో కెరీర్‌లో మళ్లీ బిజీ అయిన త్రిష, కొత్త సినిమాల కోసం తన పారితోషికాన్ని పెంచినట్లు సినీవర్గాల్లో ప్రచారం జరుగుతోంది. త్రిష కెరీర్‌ను పరిశీలిస్తే ఎన్నో విజయాలతో పాటు కొన్ని పరాజయాలు కూడా ఎదురయ్యాయి. అయితే ప్రతిసారి చిన్న విరామం తర్వాత ఆమె మరింత బలంగా తిరిగి వచ్చి తన స్థానాన్ని నిలబెట్టుకున్నారు. ఇదే కారణంగా ఆమెను సౌత్ ఇండస్ట్రీలో అత్యంత నిలకడైన హీరోయిన్లలో ఒకరిగా భావిస్తారు. ఇటీవల కొన్ని సినిమాలు ఆశించిన స్థాయిలో విజయాలు సాధించకపోయినా, తాజాగా కరుప్పు వంటి భారీ హిట్‌తో త్రిష మార్కెట్ మళ్లీ ఊపందుకుందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఆమె కెరీర్‌లో మరో గోల్డెన్ ఫేజ్ నడుస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా పెద్ద హీరోల సరసన అవకాశాలు రావడం, పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు పెరగడం, ప్రేక్షకుల్లో ఇప్పటికీ మంచి ఆదరణ ఉండటం ఆమె క్రేజ్‌కు ప్రధాన కారణాలుగా చెప్పొచ్చు. యువ హీరోయిన్ల నుంచి గట్టి పోటీ ఉన్నప్పటికీ, తన అనుభవం, నటన, స్క్రీన్ ప్రెజెన్స్‌తో త్రిష ప్రత్యేక స్థానాన్ని కొనసాగిస్తున్నారు. అందుకే నిర్మాతలు ఇప్పటికీ ఆమెను తమ ప్రాజెక్టుల్లో భాగం చేసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారని సమాచారం. ఇటీవల విడుదలైన కరుప్పు చిత్రం విజయంతో త్రిషకు కొత్త అవకాశాలు మరింత పెరిగినట్లు టాక్ వినిపిస్తోంది. ముఖ్యంగా తెలుగు, తమిళ భాషల్లో ఒకేసారి రూపొందే ద్విభాషా చిత్రాల కోసం ఆమెను సంప్రదిస్తున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే త్రిష తన రెమ్యూనరేషన్‌ను కూడా పెంచినట్లు వార్తలు వెలువడు తున్నాయి. మరోవైపు త్రిష చేతిలో ఇప్పటికే పలు ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు ఉన్నాయి. తెలుగు, తమిళంతో పాటు ఇతర దక్షిణాది భాషల నుంచి కూడా అవకాశాలు వస్తున్నాయి.

వెంకటేశ్, కళ్యాణ్ రామ్ కాంబో మరో సినిమా ప్లాన్ చేస్తున్న అనిల్ రావిపూడి

టాలీవుడ్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న దర్శకుడు అనిల్ రావిపూడి మరో భారీ మల్టీస్టారర్ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ముఖ్యంగా సంక్రాంతి సీజన్‌లో ఆయన సినిమాలకు ప్రత్యేక క్రేజ్ ఏర్పడింది. 'సంక్రాంతికి వస్తున్నాం', 'మన శంకర వరప్రసాద్ గారు' వంటి వరుస విజయాల తర్వాత అనిల్ రావిపూడి ఇప్పుడు విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్‌లతో కలిసి ఓ క్రేజీ మల్టీస్టారర్ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే వెంకటేష్‌తో 'ఎఫ్2', 'ఎఫ్3' వంటి విజయవంతమైన చిత్రాలు అందించిన అనిల్, కళ్యాణ్ రామ్‌తో తన తొలి చిత్రం 'పటాస్' ద్వారా సూపర్ హిట్ అందుకున్నారు. ఇప్పుడు ఈ ఇద్దరు హీరోలను ఒకే సినిమాలో చూపించబోతుండటంతో ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన పూజా కార్యక్రమాలు ఇప్పటికే పూర్తయ్యాయి. ప్రీ-ప్రొడక్షన్ పనులు కూడా దాదాపు ముగింపు దశకు చేరుకున్నాయని సమాచారం. పూర్తి స్థాయి యాక్షన్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న ఈ చిత్రాన్ని 2027 సంక్రాంతి కానుకగా విడుదల చేయాలని మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సినిమా టైటిల్‌కు సంబంధించి ఆసక్తికరమైన ప్రచారం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. పండుగ వాతావరణం, ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్, అనిల్ రావిపూడి స్టైల్ కామెడీకి సరిపోయేలా ఈ చిత్రానికి 'సంక్రాంతి సరుకు' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ఈ టైటిల్ మాస్, ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఆకట్టుకునే అవకాశముందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే దీనిపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇదిలా ఉంటే, ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన 'సింగ్ గీతం' గోల్డెన్ బ్లాక్‌బస్టర్ ఈవెంట్‌లో అనిల్ రావిపూడి చేసిన వ్యాఖ్యలు కూడా వైరల్‌గా మారాయి. ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు తెరకెక్కించిన ఈ చిత్ర విజయోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన, నిర్మాత నాగ్ అశ్విన్‌పై ప్రశంసలు కురిపించారు.



పెద్ది కలెక్షన్ల దూకుడు

మొత్తం రూ.307.98 కోట్ల గ్రాస్ కలెక్షన్లు

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కించిన స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా దూసుకుపోతోంది. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ పొందుతూ వసూళ్ల పరంగా కూడా సత్తా చాటుతోంది. మొదటి వారం తర్వాత వీక్‌డేస్‌లో కొంత మందగించిన కలెక్షన్లు, రెండో వీకెండ్‌లో మళ్లీ ఊపందుకోవడం విశేషం. ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం, విడుదలైన 11వ రోజు ఆదివారం 'పెద్ది' మరోసారి బలమైన ప్రదర్శన కనబరిచింది. దేశవ్యాప్తంగా సుమారు 4,133 షోల ద్వారా రూ.9.20 కోట్ల నెట్ కలెక్షన్లు సాధించినట్లు సమాచారం. దీంతో భారతీయ బాక్సాఫీస్ వద్ద 11 రోజుల్లో ఈ చిత్రం రూ.216 కోట్ల నెట్, రూ.256.23 కోట్ల గ్రాస్ వసూళ్లను నమోదు చేసినట్లు తెలుస్తోంది. ఓవర్సీస్ మార్కెట్‌లో కూడా 'పెద్ది' మంచి స్పందనను ందుకుంటోంది. విదేశీ మార్కెట్లలో ఇప్పటివరకు సుమారు రూ.51.75 కోట్ల గ్రాస్ వసూలు చేసినట్లు ట్రేడ్ రిపోర్ట్స్ చెబుతున్నాయి. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా మొత్తం రూ.307.98 కోట్ల గ్రాస్ కలెక్షన్లను తన ఖాతాలో వేసుకున్నట్లు సమాచారం. మరోవైపు చిత్ర బృందం మాత్రం మొత్తం వసూళ్లు రూ.393 కోట్లకు చేరుకున్నాయని ప్రకటించింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో కలిపి సుమారు రూ.195.30 కోట్ల గ్రాస్ వసూళ్లు నమోదైనట్లు సమాచారం. ఇది సినిమా విజయానికి కీలకంగా మారిందని ట్రేడ్ విశ్లేషకులు చెబుతున్నారు.రెండో వీకెండ్‌లో కలెక్షన్లు మళ్లీ జోరందుకోవడంతో 'పెద్ది' మరిన్ని రికార్డుల దిశగా పయనిస్తోంది.చిత్రాల్లో ఒకటిగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి.

కర్నూలులో నాగబంధం యూనిట్ సందడి

కర్నూలు నగరంలో నాగబంధం చిత్ర బృందం సందడి చేసింది. కర్నూలు కొండారెడ్డి బురుజు వద్ద అనంత పద్మనాభ స్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి ఈ సినిమా ప్రమోషన్స్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హీరో విరాట్ కర్ణ, హీరోయిన్ నభా నటేష్, కర్నూలు ఎంపీ బస్తిపాడు నాగరాజు పాల్గొన్నారు. సినిమా ప్రమోషన్‌ను కర్నూలు నుంచి ప్రారంభించడం సంతోషంగా ఉందని సినీనటులు తెలిపారు. యువతకు పురాణ కథలు, దేవాలయాల గురించి సినిమాలో చూపించామన్నారు. జులై 3వ తేదీన ఈ చిత్రం విడుదలవుతుందని, అందరూ ఆదరించాలని కోరారు. ఈ సందర్భంగా కొండారెడ్డి బురుజు వద్ద హీరోయిన్ డ్యాన్స్‌తో సందడి చేశారు.

వివాహ వార్షికోత్సవంలో పిల్ల చేతులతో పోస్ట్

ఉపాసన పోస్ట్‌తో అభిమానుల్లో ఆనందం

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్‌కు ప్రస్తుతం డబుల్ సెలబ్రేషన్స్ నడుస్తున్నాయి. ఒకవైపు ఆయన నటించిన 'పెద్ది' చిత్రం బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని నమోదు చేస్తుండగా, మరోవైపు జూన్ 14న రామ్ చరణ్-ఉపాసన దంపతులు తమ వివాహ వార్షికోత్సవాన్ని జరుపుకున్నారు. దీంతో మెగా అభిమానుల్లో ఆనందం రెట్టింపైంది.అయితే రామ్ చరణ్, ఉపాసన దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా అభిమానులు సోషల్ మీడియాలో శుభాకాంక్షల వర్షం కురిపించారు. 2012 జూన్ 14న వివాహ బంధంతో ఒక్కటైన ఈ జంట, టాలీవుడ్‌లో అత్యంత అభిమానించబడే సెలబ్రిటీ కపుల్స్‌లో ఒకరిగా నిలిచింది.ఈ ప్రత్యేక సందర్భంగా ఉపాసన కొణిదెల సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ అభిమానులను భావోద్వేగానికి గురి చేసింది. తమ ముగ్గురు పిల్లల చిన్న చేతులను చూపిస్తూ ఓ అందమైన ఫోటోను ఆమె పంచుకున్నారు. కుటుంబ బంధాలను ప్రతిబింబించే ఈ పోస్ట్ క్షణాల్లోనే వైరల్‌గా మారింది. ఇప్పటికే రామ్ చరణ్-ఉపాసన దంపతులకు కుమార్తె క్లింకార ఉన్న సంగతి తెలిసిందే. ఇటీవల వారి కుటుంబంలోకి కవల పిల్లలు కూడా చేరడంతో ఆనందం మరింత పెరిగింది. తాజా ఫోటోలో ముగ్గురు చిన్నారుల చేతులు కనిపించడంతో అభిమానులు మురిసిపోతున్నారు. 'పెద్ది' విజయం, ఇటు వివాహ వార్షికోత్సవం, కుటుంబ ఆనందాలు.. ఇలా అన్ని శుభ పరిణామాలు ఒకేసారి రావడంతో రామ్ చరణ్ కుటుంబంలో ప్రస్తుతం పండుగ వాతావరణం నెలకొంది. ఉపాసన షేర్ చేసిన ఈ ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అభిమానుల హృదయాలను గెలుచుకుంటోంది.

సల్మాన్‌తో రాజ్ నిడుమోరు చిత్రం

'ది ఫ్యామిలీ మ్యాన్', 'ఫర్జీ' వంటి సూపర్ హిట్ సిరీస్‌లకు దర్శకత్వం వహించిన రాజ్ నిడిమోరు ఇప్పుడు బాలీవుడ్‌లో భారీ సినిమాకు సిద్ధమవుతున్నారు. తాజాగా జరిగిన ఓ ఇంటర్వ్యూలో రాజ్ ఆసక్తికర విషయాలు వెల్లడించారు. 'ఒక హాలీవుడ్ సినిమా స్క్రిప్ట్ ఇప్పుడే మొదలైంది, అది ప్రీ-ప్రొడక్షన్ దశలో ఉంది. మరో సిరీస్ కూడా అభివృద్ధి దశలో ఉంది. మా హిందీ సినిమా నిర్మాణం త్వరలో ప్రారంభం కానుందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులను దృష్టిలోపెట్టుకొని, భారీ బడ్జెట్‌తో ఈ సూపర్ సినిమా రూపొందిస్తున్నారు. అక్టోబర్‌లో ఈ షూటింగ్ ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో సల్మాన్ ఖాన్ హీరోగా నటిస్తారని సమాచారం. అయితే ఈ విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. గతంలోనూ ఈ సినిమా గురించి వార్తలు ప్రచారమయ్యాయి. ఈ చిత్రంలో రాజ్ భార్య సమంత హీరోయిన్‌గా నటించే అవకాశం ఉందని వార్తలు వచ్చాయి. అయితే, వాటిని రాజ్ సన్నిహిత వర్గాలు కొట్టిపారేశాయి. ఇక, సల్మాన్ ప్రస్తుతం దర్శకుడు వంశీ పైడిపల్లి, నిర్మాత దిల్‌రాజు కాంబినేషన్‌లో వస్తున్న మూవీలో షూటింగ్‌లో బిజీగా ఉన్నారు.

Printed & published owned by K.SRAVAN KUMAR. Printed Published RK PRINTING PRESS at 6-1-948 Boyawada Street Nalgonda.Pin : 508001. Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. RNI.NO.APTEL/2009/29433.(CELL) 9866330400 prajaveekshanam@gmail.com